ప్రతిపక్షం

www.prathipaksham.in



శనివారం 14.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 353 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



మూసీ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా?

"మూసీ నది పునరుజ్జీవనంపై ప్రజల్లో అపోహలు కలిగించేలా కొందరు ఉద్దేశపూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధసత్యాలు ప్రచారం చేస్తున్నారు. మూసీ పునరుజ్జీవనంపై వాస్తవాలను ప్రజలకు వివరించడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత. మానవ నాగరికత నదుల చుట్టూనే అభివృద్ధి చెందింది. ప్రపంచ దేశాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న సమయంలో మనం వెనకబడితే భవిష్యత్ తరాలు క్షమించవు. గొప్ప వారసత్వం కలిగిన హైదరాబాద్ నగరాన్ని ఇలాగే వదిలేయాలా? మూసీ పునరుజ్జీవనంతో పర్యాటక అభివృద్ధి, నైట్ ఎకానమీ, బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయి. నేను మీలో ఒకడిని... మీ సూచనలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. అందరి సహకారంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును పూర్తి చేద్దాం"

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- బాధ్యతాయుతంగా మూసీ అభివృద్ధి
- రెండేళ్లుగా ప్రతి అంశం పరిశీలించాం
- ఇప్పటికీ కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవు
- మూసీకి 20 టీఎంసీల గోదావరి జలాలు
- గోదావరి జలాలు ప్రవహించేలా 2.5 టీఎంసీలు
- హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు 17.5 టీఎంసీలు
- మూసీ ప్రక్షాళనకు రక్షణ మంత్రిత్వశాఖ 100 ఎకరాలు ఇస్తోంది
- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నాం
- 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 13: 20 టీఎంసీల గోదావరి జలాలను మూసీకి తరలించే పనులు చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా, మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చే యత్నం చేస్తామని చెప్పారు. మూసీ ప్రక్షాళనకు రక్షణ మంత్రిత్వశాఖ 100 ఎకరాలు ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నామని అన్నారు. హైదరాబాద్ తాజ్‌కృష్ణలో జరిగిన మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మూసీ ప్రక్షాళనకు సంబంధించిన అనేక అంశాలను వివరించారు. మూసీలో ప్రవహిస్తున్న విషం నల్గొండ ప్రజలను అతలాకుతలం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ వల్ల నల్గొండ నివాసయోగ్య ప్రాంతం కాదని డబ్ల్యూహెచ్‌వో చెప్పిందని, ఫ్లోరైడ్ నీటితో పండించిన పంటలు తినేందుకు ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మానవ, పశువుల కళేబరాలు, ఫార్మా రసాయనాలు, కాలుష్యంతో మూసీ కలుషితమవుతుందని పేర్కొన్నారు. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోందని, రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా? అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం

...:: మిగతా 2లో

గ్యాస్ కొరత లేకుండా చూస్తాం

ఇంధన, గ్యాస్ సరఫరాపై సత్వర చర్యలు



- కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది
- ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సీఎస్‌నేతృత్వంలో రాష్ట్ర స్థాయి కమిటీ
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 13: రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై సత్వర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొంత కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని, రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం ముందుకెళ్తున్నామని తెలిపారు. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని అన్నారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని,

...:: మిగతా 2లో

90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే



- టికెట్ రేట్లు పెంచుకునే విషయంలో నిర్మాతలకు ఊరట
- ప్రీమియర్స్‌తో పాటు టికెట్ రేట్లను పెంచుకునేందుకు వెసులుబాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 13: టికెట్ రేట్లు పెంచుకునే విషయంలో తెలుగు నిర్మాతలకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమాల టికెట్ రేట్ల పెంపుపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిన

...:: మిగతా 2లో



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆర్గానిక్ ఫార్మింగ్ లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయండి
- వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేయండి
- వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి13: రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలతో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆర్గానిక్, నేచురల్

...:: మిగతా 2లో

రేవంత్ బినామీ దందాపై దర్యాప్తు జరిపించండి



- 'కేఎల్ఎస్ఆర్'పై కేంద్ర హోంమంత్రికి కేటీఆర్ లేఖ
- సీఎం ఒత్తిడితోనే సాక్ష్యాధారాలు తారుమారు
- అధికారులు హైకోర్టుకు నివేదించడమే నిదర్శనం
- సీబీఐ దర్యాప్తు జరిపించండి.. లేఖలో కేటీఆర్ వినతి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 13: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఆర్థిక అవకతవకలు, బ్యాంకులను


...:: మిగతా 2లో

మూసీ అభివృద్ధి పేరుతో విధ్వంసం



- ప్రభుత్వం చేస్తున్నది ప్రక్షాళననా? లేక సుందరీకరణనా?
- డీపీఆర్ సిద్ధం కాకముందే పేదలకు నోటీసులా?
- ప్రభుత్వ ఆస్తులపై కూడా ఇదే విధానం అమలు చేస్తారా?
- మురుగు నీటిని అడ్డుకోకుండా ప్రక్షాళన ఎలా సాధ్యం?
- మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు
- చిత్తశుద్ధి ఉంటే మురుగు నీటి శుద్ధిపై దృష్టి పెట్టాలి
- ప్రభుత్వం ప్రజల ఇండ్లను కూల్చడం సరైంది కాదు
- మూసీ బ్యూటిఫికేషన్‌పై సీఎం ప్రణాళికలపై హరీశ్‌రావు ప్రశ్నలు

...:: 2లో



టెహ్రాన్‌లో భారీ పేలుడు

- వేలాది మంది హాజరైన ర్యాలీలో విస్ఫోటం
- దాడి చేస్తామని ముందే హెచ్చరించిన ఇజ్రాయెల్
- అబ్రహం లింకన్ నౌకపై దాడి చేశాం: ఇరాన్
- త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది : ట్రంప్
- ఇరాక్‌లో కూలిన అమెరికా రీఫ్యూయెలింగ్ విమానం
- గల్ఫ్ దేశాలపై కొనసాగుతున్న ఇరాన్ దాడులు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా కొనసాగుతోంది. ఇరాన్‌లోని భద్రత చెక్‌పాయింట్లపై, లెబనాన్‌లోని పర్యాటక ప్రాంతంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేశాయి. ఈ దాడుల్లో 21 మంది మరణించగా 32 మంది గాయపడ్డారు. మరోవైపు తమ దేశంలోని జనావాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఇది ఘోరమైన యుద్ధ నేరమని పేర్కొంది. అటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా చేస్తున్న దాడులపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది.

టెహ్రాన్‌లో భారీ పేలుడు..

రాజధాని టెహ్రాన్‌లో శుక్రవారం భారీ పేలుడు

...:: మిగతా 2లో


ఆర్టీసీలో సమ్మె సైరన్

- నోటీసులు ఇచ్చిన జేఏసీ నేతలు
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి
- ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలి
- గుర్తింపుసంఘం ఎన్నికలు జరపాలి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఆర్టీసీ జేఏసీ డిమాండ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 13: ఆర్టీసీ కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జేఏసీ నేతలు

...:: మిగతా 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.31 (శనివారం సాయంత్రం)

సహర్ – 5.02 (ఆదివారం ఉదయం)



దేశ రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తున్నాం

ఎన్డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి, దేశం స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశం పట్ల తమ నిబద్ధత లోపాన్ని ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు.


9



రాజ్యాంగం ప్రజల గొంతుక

రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు.

9



దేశంలో ఎల్పీజీ కొరత లేదు

దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ కొరత లేదని, భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ప్రజలు భయాందోళనతో వెంటవెంటనే ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ చేస్తున్నారని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ తెలిపారు.

9

రాష్ట్రీయం

గ్యాస్ కొరత లేకుండా చూస్తాం

మొదటిపేజీ తరువాయి

దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎల్పీజీ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఎల్పీజీ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయని మంత్రి ఉత్తం అన్నారు. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తం చెప్పారు.

90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

మొదటిపేజీ తరువాయి

విషయం తెలిసిందే. సినిమా విడుదలకు 90రోజులకు ముందే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలనే హైకోర్టు ఆదేశాలపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయాన్ని వెలువరించింది. దీంతో త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న అగ్ర హీరోల చిత్రాలకు ఊరట లభించింది. గతంలో మాదిరిగానే ప్రీమియర్స్‌తో పాటు టికెట్ రేట్లను పెంచుకునేందుకు వెసులుబాటు లభించింది. ఇకపై టికెట్ ధరల పెంపు కోసం సాధారణ పద్ధతిలోనే నిర్మాతలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకునే వీలు కలిగింది. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం కీలక ఆదేశాలను జారీ చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులతో పవన్‌కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా టికెట్ రేట్ల పెంపునకు మార్గం సుగమమైంది. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి

ఫార్మింగ్ లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములుగా చేయాలని వ్యవసాయ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గోడౌన్లు, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్తును విక్రయించుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో చేపట్టని అనేక సంక్షేమ పథకాలను రైతుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పెద్ద సంఖ్యలో పంపిణీ చేస్తుంది అదేవిధంగా విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని ఈ అంశాన్ని రైతులకు చక్కగా వివరించాలని మంత్రులు సూచించారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాల కింద వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న తీరు, నీటి సరఫరా, యాసంగి వరి సాగు, మార్కెట్లోకి రానున్న ధాన్యం, సేకరణ తదితర అంశాల పై మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ అల్దాస్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ బినామీ దందాపై దర్యాప్తు జరిపించండి

మొదటిపేజీ తరువాయి

మోసగించడం వంటి ఆర్థిక నేరాలు కలిగిన తన బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాను కాపాడుకొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, అధికారులపై ఒత్తిడి తెచ్చి సాక్ష్యాధారాలు తారుమారు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లోనే విచారణలో భాగంగా సేకరించిన కీలక ఆధారాలు పోయాయంటూ అధికారులు కోర్టులో చెప్పారని అనుమానం వ్యక్తంచేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే స్పందించి ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు అమిత్‌షాకు లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి బినామీ కంపెనీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు అక్రమంగా కాంట్రాక్టులు కట్టబెట్టారని పేర్కొన్నారు. సదరు కంపెనీకి సంబంధించిన కేసులపై విచారణ సందర్భంగా సీఎం ఆదేశాల మేరకే ప్రభుత్వం సాక్ష్యాలను మాయం చేసిందని ఆరోపించారు. దివాలా కంపెనీల జాబితాలో ఉన్న కేఎల్ఆర్ఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి భారీగా కాంట్రాక్టులు కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే సుమారు రూ. 2,500 కోట్ల విలువైన పనులు అప్పగించినట్టు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయని గుర్తుచేశారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సరఫరా పనులు, ప్రధాన రహదారుల నిర్మాణ పనులు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్టులు అప్పగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి అనుమానాలకు తావిస్తున్నదని వ్యాఖ్యానించారు.

కేఎల్ఎస్ఆర్ పేరిట సీఎం వాహనం

కేఎల్ఎస్ఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న అనుబంధం జగమెరిగిన సత్యమని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఆదాయపు పన్ను శాఖ విచారణలో ముఖ్యమంత్రి సుదీర్ఘకాలంగా వినియోగిస్తున్న టొయోటా ల్యాండ్ క్రూజర్ (టీఎస్ 07 ఎఫ్ఎఫ్ 0009) వాహనం కేఎల్ఎస్ఆర్ పేరిట నమోదైన విషయం బయటపడిందని తెలిపారు. సదరు కంపెనీకి సంబంధించిన దివాలా వ్యవహారం నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ముందు విచారణలో ఉండగా, విచారణను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో 2025 ఆగస్టు 13న ట్రిబ్యునల్ సభ్యుడు జస్టిస్ శరద్‌కుమార్ కేసు విచారణ నుంచి తప్పుకొన్నారని నివేదికలు వెల్లడించాయని గుర్తుచేశారు. అలాగే 2022లో కేఎల్ఎస్ఆర్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభించిన 'యాస్ మెట్ కార్ప్' సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీకార చర్యలకు దిగిందని నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతీకార చర్యల్లో భాగంగా 75 ఏండ్ల వయస్సు కలిగిన క్యాన్సర్ పేషెంట్‌ను అరెస్ట్ చేసిన తీరు ఎంతగానో ఆందోళన కలిగించిందని తెలిపారు. తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతున్న రిట్ పిటిషన్ నంబర్ 18267/2025 సందర్భంగా కీలకమైన సాక్ష్యాధారాలుగా స్వాధీనం చేసుకున్న పత్రాలు అధికారిక కస్టడీ నుంచి కనిపించకుండా పోయిన విషయం బయటపడిందని, దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఆందోళన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ విచారణ వ్యవహారంతోపాటు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం కూడా సాక్ష్యాధారాల భద్రతపై మరింత అనుమానాలు పెంచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని, కేఎల్ఎస్ఆర్‌పై ఉన్న ఆర్థిక ఆరోపణలు, కాంట్రాక్టుల కేటాయింపులో జరిగిన అక్రమాలు, మనీ ల్యాండరింగ్ అనుమానాలపై పక్షపాత రహితంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు (ఎస్ఎఫ్ఐవో)తో సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని లేఖ ద్వారా కేటీఆర్ అభ్యర్థించారు.

మూసీ అభివృద్ధి పేరుతో విధ్వంసం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ మూసీ పేరిట జరుగుతున్న లూటీకి మాత్రం తీవ్రంగా వ్యతిరేకమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా బాధితుల తరపున కొన్ని సూటి ప్రశ్నలు అడుగుతున్నామని హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూసీ సుందరీకరణ పేరిట వేలాది మంది పేదలను నిరాశ్రయులను చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మూసీ అభివృద్ధికి తొలి అడుగులు బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే పడినట్లు తెలిపారు. నాలుగు వేల కోట్ల రూపాయలతో 32 ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, గోదావరి నీటిని మూసీలోకి తీసుకువచ్చి నది శుద్ధి చేయాలనే ప్రణాళిక రూపొందించామని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తుగ్లక్ పాలనను గుర్తు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఒకసారి మూసీ సుందరీకరణ, మరోసారి మూసీ ప్రక్షాళన, ఇంకోసారి మూసీ పునరుజ్జీవనం అంటూ పూటకో పేరు మార్చుతూ ప్రజల ఇండ్లను కూల్చడం సరైంది కాదని అన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం కొనసాగుతున్నదని ఆరోపించారు. మూసీ శుద్ధి విషయంలో ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే ముందుగా మురుగు నీటి శుద్ధిపై దృష్టి పెట్టాలని హరీశ్‌రావు సూచించారు. వికారాబాద్ నుంచి వచ్చే మురుగు నీటిని అడ్డుకోకుండా ప్రక్షాళన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఉన్న ఎస్టీపీ సరిగా పనిచేయడం లేదని, ముందుగా ఆ సమస్యను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, లక్షా యాభై వేల కోట్ల రూపాయలతో మూసీ బ్యూటిఫికేషన్‌కు టెండర్లు పెట్టడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు.

మూసీ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా?

మొదటిపేజీ తరువాయి

కాదన్నారు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, అభివృద్ధి పనుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. ఎలాంటి ఆధారం, ఆదరణ, ప్రభుత్వ వసతులు లేక మూసీ ఒడ్డున ఉన్నారని, చివరి మజిలీగా మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు.

బాధ్యతాయుతంగా మూసీ అభివృద్ధి

"విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశాం. ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నాం. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించాం. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. చంద్రబాబు, వైఎస్ఆర్ హయాంలో సైబరాబాద్ నిర్మించారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏవైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధం. గాంధీ స్ఫూర్తి కోసం వారి అస్తికలను దేశంలో వివిధ ప్రాంతాల్లో పెట్టారు. కన్యాకుమారి వద్ద రెండు సముద్రాలు కలిసే చోట గాంధీ అస్తికలు పెట్టారు. మూసీ, ఈసీ సంగమం లంగర్‌హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

నదీ పరివాహక ప్రాంతంలో ఎకనమిక్ జోన్

"నదీ పరివాహక ప్రాంతంలో ఎకనమిక్ జోన్ తయారు చేస్తున్నాం. హైదరాబాద్ నగరంలోని చెరువులు పునరుద్ధరిస్తున్నాం. చెరువులు పునరుద్ధరిస్తున్నందుకు ప్రజలు మాకు ఘనస్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీ ప్రక్షాళనకు రక్షణ మంత్రిత్వశాఖ 100 ఎకరాలు ఇస్తోంది. మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్ల వరదలొస్తున్నాయి. మూసీ బ్యూటిఫికేషన్‌ను.. లూటిఫికేషన్ అని విమర్శిస్తున్నారు. మహాత్మాగాంధీ విగ్రహానికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని అసత్యాలు చెబుతున్నారు. మహాత్మాగాంధీ విగ్రహానికి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నాం. యుద్ధాన్ని శాంతితో గెలవచ్చని ప్రపంచానికి సందేశం ఇచ్చిన వ్యక్తి గాంధీ. బ్రిటీషు వాళ్లకు వ్యతిరేకంగా పోరాడినా.. గాంధీపై లాఠీ దెబ్బ పడలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆర్నెళ్లలోనే గాంధీని పొట్టనపెట్టుకున్నవాళ్లు నీతులు చెబుతున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్ సురక్షితమైన నగరం

స్వాతంత్ర్యం వచ్చాక మనం కట్టిన అద్భుత కట్టడం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు సీఎం రేవంత్‌రెడ్డి. మంచి పనులు చేపట్టినప్పుడు సహకరించకున్నా పర్వాలేదు.. అడ్డుకోకండన్నారు. "గొప్ప గొప్ప వర్సిటీల్లో చదివామని చెప్పుకుంటున్న వారు సలహాలు ఇవ్వండి. సమాజానికి మంచి పనులు చేసి... మంచికి ప్రతినిధి కావాలనుకుంటున్నా. అభివృద్ధి అవసరం లేదనుకుంటే అందరూ తీర్మానం చేయండి ఆపేస్తా. ప్రకృతి కంటే మనం గొప్పవాళ్లమా? హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. నీళ్లు భూమిలోకి వెళ్లకపోతే...నీళ్లు ఎలా వస్తాయి? మా ఇంట్లో 1500 అడుగుల బోరు వేస్తేనే నీళ్లు వచ్చాయి. మూసీలో నిరంతరాయంగా నీళ్లు ప్రవహిస్తే..భూమిలోకి నీళ్లు వెళ్తాయి. ఏవైనా అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టినప్పుడు భూములు పోతాయి. ఇళ్లు కోల్పోయిన వారికి గతంలోకంటే ఎక్కువ పరిహారం ఇస్తామని చెబుతున్నాం. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నాం. దుబాయ్ కంటే హైదరాబాద్ సురక్షితమైన నగరం. ప్రజలకు అబద్ధాలు చెప్పడానికి కొందరు నెలకు రూ.5 కోట్లు ఖర్చు పెడుతున్నారు. పేదలతో మాకు శత్రుత్వం ఏముంది.. పేదలతో శత్రుత్వం చేస్తే మళ్లీ అధికారంలోకి వస్తామా? మూసీని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని వాళ్లకు ఈర్ష్య.. చెడు చూడను.. చెడు వినను.. మంచి ఎవరు చెప్పినా స్వీకరిస్తాను" ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రజల్లో అపోహలు కలిగించేలా అర్ధసత్యాలు ప్రచారం

మూసీ నది పునరుజ్జీవనంపై ప్రజల్లో అపోహలు కలిగించేలా కొందరు ఉద్దేశపూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధసత్యాలు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అధికారాన్ని ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కాకుండా కాపలాదారుగా వినియోగించాలనే నమ్మకం తమ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవనంపై వాస్తవాలను ప్రజలకు వివరించడం ముఖ్యమంత్రిగా తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. మానవ నాగరికత నదుల చుట్టూనే అభివృద్ధి చెందిందని, ప్రపంచ దేశాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న సమయంలో మనం వెనకబడితే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. 1908లో వచ్చిన భీకర మూసీ వరదల తర్వాత నగర రక్షణ కోసం ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనల మేరకు అప్పటి నిజాం పాలనలో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ , ఉస్మానియా సాగర్ రిజర్వాయర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. గొప్ప వారసత్వం కలిగిన హైదరాబాద్ నగరాన్ని ఇలాగే వదిలేయాలా అని ప్రశ్నించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని సవాల్ చేశారు. తప్పులు ఉంటే సూచనలు చేయాలని, కానీ అభివృద్ధి అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మూసీ పునరుజ్జీవనంతో పర్యాటక అభివృద్ధి, నైట్ ఎకానమీ, బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని సీఎం చెప్పారు. పేదలకు సరైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే నిరాశ్రయుల పూర్తి వివరాలు ప్రభుత్వ వద్ద ఉన్నాయని, వారికి ఇళ్ల నిర్మాణం, స్కూళ్లు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోకకళ్యాణం కోసం చేసే పనులను అడ్డుకోవద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. దేవతల యజ్ఞాలను రాక్షసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా యజ్ఞం ఆగలేదని ఉదాహరణ ఇచ్చారు. "నేను మీలో ఒకడిని... మీ సూచనలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. అందరి సహకారంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును పూర్తి చేద్దాం" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఆర్టీసీలో సమ్మె సైరన్

మొదటిపేజీ తరువాయి

యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ ఎండీ లేకపోవడంతో ఈడీ వెంకన్నకు నోటీసు పత్రాన్ని అందించారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్ మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.350 కోట్లలో ఎటువంటి కోతలు, షరతులు లేకుండా సక్రమంగా విడుదల చేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఖాయం ..

పెండింగ్ ఉన్న రూ.2,500 కోట్ల పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే జరపాలని యాజమాన్యానికి కోరారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం ఉంటుందని జేఏసీ నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని తేల్చి చెప్పారు.

ప్రభుత్వంతోనే మా యుద్ధం

హామీల కోసం ఎదురు చూశామని ఇక తమకు ఓపిక నశించిపోయిందని కార్మిక సంఘాల జేఏసీ వ్యాఖ్యానించింది. ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు భరోసా లేదా? తాము ఎలా బతకాలి? అని వాపోయారు. తమకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా వాటా కావాలన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌ను ఎందుకు మార్చరని ప్రశ్నించిన ఆర్టీసీ జేఏసీ నేతలు, యాజమాన్యానికి తనకు ఎలాంటి యుద్ధం లేదని చెప్పారు.

టెహ్రాన్‌లో భారీ పేలుడు

మొదటి పేజీ తరువాయి

సంభవించింది. పాలస్తీనా పౌరులకు మద్దతు తెలియచేస్తూ, ఇజ్రాయెల్ అంతాన్ని కోరుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఖుద్స్ వార్షికోత్సవం కోసం వేలాదిమంది ఇరానీయులు శుక్రవారం హాజరైన ప్రదేశం వద్ద బాంబులు వేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఈ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎంతమంది మరణించిందీ వెంటనే వివరాలు తెలియరాలేదు. అయితే ఇజ్రాయెల్ బాంబు దాడి హెచ్చరికలు, ఏదేమైనా తమ ప్రజా నిరసనలు కొనసాగించాలన్న ఇరాన్ నిర్ణయం ఇరు పక్షాల దృఢ సంకల్పాన్ని వెల్లడిస్తున్నాయి. టెహ్రాన్ సెంట్రల్‌లోని ఫిర్దోసీ చౌక్ వద్ద అమెరికా, ఇజ్రాయెల్‌కు మరణశిక్ష విధించాలని నినదిస్తూ వేలాదిమంది ఇరాన్ పౌరులు ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఇరాన్ న్యాయశాఖ అధిపతి గులాంహుస్సేన్ మొహసేని ఇజీ ఒక స్థానిక టెలివిజన్ విలేకరితో మాట్లాడుతూ ఈ క్షిపణుల వానకు ఇరాన్ భయపడదని చెప్పడం కనిపించింది. ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడి దాని నిస్పృహను తెలియచేస్తుందని సీనియర్ భద్రతా అధికారి అలీ లారీజానీ ప్రకటించారు.

ఇరాక్‌లో కూలిన అమెరికా రీఫ్యూయెలింగ్ విమానం

ఇరాక్‌లో గురువారం కూలిపోయిన అమెరికన్ కేసీ135 రీఫ్యూయెలింగ్ విమానంలోని ఆరుగురు సిబ్బంది మరణించారని అమెరికన్ సైన్యం ప్రకటించింది. ఇది ఫ్రెండ్లీ లేక శత్రువులు జరిపిన దాడి వల్ల జరిగిన ప్రమాదం కాదని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. రెండు విమానాలు రీఫ్యూయెలింగ్‌కి వెళ్లగా అందులో ఒకటి సురక్షితంగా ల్యాండ్ అయిందని తెలిపింది. ఇరాన్‌పై సైనిక ఆపరేషన్లలో భాగంగా కూలిపోయినట్లు అమెరికా బహిరంగంగా ప్రకటించిన కేసీ135 విమానాలలో ఇది నాలుగవది.

మొజ్తబాపై రూ. 92 కోట్ల రివార్డు : అమెరికా

ఇరాన్ సుప్రీం అయతుల్లా ఖమేనీ స్థానంలో బాధ్యతలు చేపట్టిన ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ ఆచూకీని తెలియజేస్తే 10 మిలియన్ డాలర్లు (రూ. 92,47,48,000) బహుమతిగా ఇస్తామని అమెరికా ప్రకటించింది. ఈ విషయాన్ని యూఎస్ న్యాయ శాఖ శుక్రవారం వెల్లడించింది.

అబ్రహం లింకన్ నౌకపై దాడి చేశాం : ఇరాన్

అమెరికా విమాన వాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డు కోర్ (ఐఆర్‌జీసీ) గురువారం ప్రకటించింది. తమ దాడుల్లో భారీగా దెబ్బతిన్న అణుశక్తి సామర్థ్యం గల అబ్రహం లింకన్ ప్రాంతీయ జలాల నుంచి నిష్క్రమిస్తున్నదని ఐఆర్‌జీసీ తెలిపింది. ఒమన్ సముద్ర తీరం సమీపం నుంచి నిర్వహిస్తున్న నౌక నుంచి అబ్రహం లింకన్ లక్ష్యంగా దాడులు జరిపినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించినట్లు ఇరానియన్ ప్రభుత్వ మీడియా ప్రెస్ టీవీ పేర్కొన్నది.

ఇరాన్ లొంగిపోనున్నది : ట్రంప్

దాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని పేర్కొన్నారు. జీ7 దేశాలతో జరిగిన వర్చువల్ సమావేశంలో ప్రకటించారు. మనందరినీ బెదిరిస్తున్న క్యాన్సర్‌ని తాను వదిలించినట్లు ట్రంప్ అమెరికన్ సైన్యం గురించి గొప్పగా ఈ సమావేశంలో తన మిత్ర దేశాలకు వెల్లడించినట్లు జీ7 దేశాలకు చెందిన ముగ్గురు అధికారులను ఉటంకిస్తూ ఆక్సియోస్ వార్తాసంస్థ పేర్కొన్నది.







ఘనంగా కవిత జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చిన జాగృతి నాయకులు, అభిమానులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత జాగృతి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం వేద పండితులు ఆశీర్వాదం ఇవ్వగా, బంజారా పుజారులు కవితను దీవించారు. జాగృతి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ ఎత్తున తరలి వచ్చి ఆమెకు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో అభిమానులతో కలిసి కవిత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భారీ గజమాలతో జాగృతి నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్నిచాటుకున్నారు. పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, నాయకులు, పలువురు ప్రముఖులు ఆమెను కలిసి బర్త్‌డే విషెష్‌తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగానూ జాగృతి నాయకులు, అభిమానులు ఘనంగా కవిత బర్త్ వేడుకలు నిర్వహించారు. అంతకుముందు కవితకు వారి నివాసంలో బంజారా పీఠాధిపతులు, వేద పండితులు ఆమెకు వేద అశీర్వచనం అందజేశారు.

గోధుమలతో భారీ చిత్రం..

యూపీలో గోధుమలతో కల్వకుంట్ల కవిత భారీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఉత్తర ప్రదేశ్ లోని మురాదాబాద్ లో జావేద్ మాలిక్ అనే కళాకారుడు బిల్డింగ్ టెర్రస్ పై గోధుమలతో బతుకమ్మ ఎత్తుకున్న కవిత గారి భారీ పటాన్ని చిత్రించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ జాగృతి యువ నాయకులు మైలారం అరుణ్ రెడ్డి, కృష్ణారెడ్డి కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు ఈ చిత్రపటం ఏర్పాటు చేయించారు.

డాక్యుమెంటరీ విడుదల..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా జాగృతి నాయకుడు చిన్ను గౌడ్ డాక్యుమెంటరీ ని రూపొందించారు. ప్రసాద్ ల్యాబ్స్‌లో డాక్యుమెంటరీని ఆవిష్కరించిన కవిత తనయుడు ఆదిత్య ఆవిష్కరించారు. కవిత తెలంగాణ ఉద్యమ ప్రస్థానం, తెలంగాణ సాంస్కృతిక వైభవం పునరుజ్జీవం కోసం కవిత గారు సాగించిన కృషి.. బతుకమ్మను విశ్వవ్యాప్తం చేయడానికి చేసిన పరిశ్రమ.. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పడుతున్న తపన.. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా చేస్తున్న ప్రయత్నాలను విజువల్ డాక్యుమెంటరీలో పొందుపరిచారు. డాక్యుమెంటరీ రూపొందించిన చిన్ను గౌడ్ ను కవిత గారి తనయుడు ఆదిత్య ప్రశంసించారు. కార్యక్రమంలో జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, లోక రవిచంద్ర , మరిపల్లి మాధవి, భవానీ వేముల, వరలక్ష్మి, మనోజ, తదితరులు పాల్గొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులకు ఈ సందర్భంగా కవిత కృతజ్ఞతలు తెలిపారు.



ఐపీఎల్-2026లో ముంబై ఇండియన్స్‌మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను ఇంపాక్ట్ సబ్‌గా కాకుండా ఫుల్‌టైమ్ ప్లేయర్‌గా ఆడించాలి. రోహిత్ ప్రస్తుతం గతంలో కంటే ఫిట్‌గా ఉన్నారు. ఆయన సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. అనుభవం ఉన్న లీడర్ మైదానంలో ఉంటే కెప్టెన్ హార్దిక్‌కు హెల్ప్ అవుతుంది.
- మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా

నాణ్యమైన ఉపాధి ఆధారిత విద్య అవసరం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ బాలకిష్ట రెడ్డి
- తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రగామి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్
- ఏప్రిల్ 14న 'డిజిటల్ సాధికారత' దినోత్సవం
- అంబేద్కర్ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి
- "సుస్థిర అభివృద్ధికి వ్యాపార పరివర్తన" అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి నాణ్యమైన, సమ్మిళిత విద్యను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విద్యను ఉన్నత విద్యా సంస్థలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల కెరియర్ అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్రంలో అన్ని విశ్వ విద్యాలయాలలో పలు నైపుణ్య, ఉపాధి ఆధారిత కోర్సులు ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో "సుస్థిర అభివృద్ధి కి వ్యాపార పరివర్తన"అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా మార్పులు జరుగుతున్నాయన్నారు. ఇకామర్స్, మొబైల్ కామర్స్, డిజిటల్ ప్లాట్ఫారమ్లు వంటి సాంకేతిక పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపార పద్ధతులను, వినియోగదారుల ఆలోచనా విధానాలను మారుస్తున్నాయన్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ దశలు ఇప్పుడు డిజిటలైజేషన్, కోవిడ్ మహమ్మారి తరువాత పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో కొత్త శకానికి దారితీసిందని వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉన్నత విద్యా సంస్థలు నాణ్యమైన, ఉపాధి ఆధారిత విద్యను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ డా. బీఆర్ అంబేద్కర్ సామాజిక సంస్కర్త మాత్రమే కాదని సమ్మిళితమైన, సమానమైన ఆర్థిక వ్యవస్థను ఊహించిన ప్రముఖ ఆర్థికవేత్త అని అభివర్ణించారు. సాంకేతిక అభివృద్ధి నేపథ్యంలో ఆర్థిక అవకాశాలకు పెంపొందించడానికి విద్యా బోధనలో సరికొత్త వ్యూహాలను పునరాలోచించుకోవాలని ప్రొ. ఘంటా చక్రపాణి సూచించారు. డా. బిఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న విశ్వవిద్యాలయం 'డిజిటల్ సాధికారత' దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 'సమత' వంటి కార్యక్రమాలని ప్రారంభించామన్నారు. తమ విద్యార్థులను కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులుగా చూడాలనే లక్ష్యంతో టీసీఎస్ లాంటి దిగ్గజ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జయేష్ రంజన్ మాట్లాడుతూ తలసరి ఆదాయం పరంగా దేశంలోనే తెలంగాణ అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఉందని, గ్రామీణ ప్రజల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కోటి మంది మహిళలు "కోటీశ్వరులు"గా మారడానికి వీలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా సాధికారపరచడంపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి "వికసిత భారత్" నిర్మించాలనే నరేంద్ర మోడీ జాతీయ దార్శనికతను ప్రస్తావిస్తూ భారతదేశం 2047 నాటికి ముప్పై ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకుందని, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (కోజికోడ్) డీన్ (ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్) ప్రొఫెసర్ సుదర్శన్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఫ్యాకల్టీ డీన్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొ. ఐ. ఆనంద్, సెమినార్ కో డైరెక్టర్ ప్రొ. డి. రబింద్రనాథ్ సోలమన్, డైరెక్టరేట్ ఆఫ్ అకడమిక్స్, డైరెక్టర్ ప్రొ. జి. పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి, కాన్ఫరెన్స్ కోడైరెక్టర్ ప్రొ. వైఎస్. కిరణ్మయి, కాన్ఫరెన్స్ సెక్రటరీ డాక్టర్ పి. రాధా కృష్ణ, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్ బర్ల, ప్రొ. వద్దాణం శ్రీనివాస్, ప్రొ. పల్లవి కబ్డే, ప్రొ. చంద్రకళ, డైరెక్టర్లు, డీన్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.



కవిత పుట్టినరోజు సందర్భంగా ఖ్యాతిస్ ఫౌండేషన్ సేవ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పుట్టినరోజు సందర్భంగా ఖ్యాతిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ ప్రాంతంలో ఉన్న హోప్ చిల్డ్రన్ హోమ్‌లో విద్యార్థుల కోసం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని పిల్లలకు విద్యా సామగ్రి, ఆహార పదార్థాలను పంపిణీ చేసి వారికి ఆనందాన్ని పంచారు. ఈ కార్యక్రమం తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవాని వేముల కుమార్తె, ఖ్యాతిస్ ఫౌండేషన్ అంబాసిడర్ చిన్నారి తోట ఖ్యాతి పటేల్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. ఇందులో ప్యాడ్లు, పెన్ ప్యాకెట్లు, పెన్సిల్ ప్యాకెట్లు, ఈరేజర్లు, షార్పనర్లు, హాల్ టికెట్ పౌచ్‌లు వంటి అవసరమైన సామగ్రిని అందజేశారు. పిల్లల కోసం బియ్యం సంచులు, గ్రాసరీ సరుకులు, స్నాక్స్, చాక్లెట్లు, కేక్స్, చిప్స్ వంటి ఆహార పదార్థాలను పంపిణీ చేసి ప్రత్యేకంగా మధ్యాహ్న భోజనాన్ని కూడా ఏర్పాటు చేశారు.

మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు

- పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తాం
- గ్యాస్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయం సృష్టిస్తున్నారు
- రాహుల్ వంటి నేతల వ్యాఖ్యలు దురదృష్టకరం
- టీబీజేపీ చీఫ్ఎన్. రాంచందర్ రావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: మూసీ ప్రాజెక్ట్‌పై భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకత లేదని, కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మూసీపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. మూసీ నది పునరుజ్జీవనం గానీ, మూసీ ప్రాజెక్టు గానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణా నదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని, అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని, ఆ నీరు రైతులకు సాగునీటిగా ఉపయోగపడాలని బీజేపీ స్పష్టంగా కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ భారతీయ జనతా పార్టీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని, కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మాత్రం మొదటి నుంచీ ఒకటేనని స్పష్టంగా చెబుతోందని అన్నారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని ఇప్పటికీ చెబుతున్నామని, కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని, ఆ ఇళ్లను కూల్చకుండా కూడా మూసీని శుద్ధి చేయవచ్చన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

ప్రజల్లో భయం సృష్టించడం బాధ్యతారాహిత్యం

దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయం సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. జైశంకర్ గారు, ప్రధాని నరేంద్ర మోదీ సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరాలు హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని, సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలిపారు.

ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

- ఐటీ, పరిశ్రమల, వాణిజ్య శాఖల మంత్రి శ్రీధర్ బాబు
- సచివాలయంలో మంత్రిని కలిసిన జర్మన్ ప్రతినిధి బృందం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్: ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హోహ్ ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా హాజరయ్యారు.

రాష్ట్రానికి అవసరమైన నిధులు ఇవ్వండి

- స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం
- జల్ జీవన్ మిషన్ పై రాష్ట్రాల మంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు మేము అనేక ప్రతిపాదనలు పంపామని, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవస్థలను స్థిరీకరించడం, దీర్ఘకాలం కొనసాగించేలా నిర్వహించడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ పై రాష్ట్రాల మంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహణ కోసం కూడా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఈ నేపథ్యంలో నిర్వహణ వ్యయాల్లో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్ ను మరో రెండు సంవత్సరాలు పొడిగించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. అదే సమయంలో రాష్ట్రాలు అమలు చేస్తున్న తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ ఖర్చులను కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోవాలని మేము మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.



మాలల హక్కులను పరిరక్షించాలి

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి13: మాలల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడి అంజయ్య మాట్లాడుతూ రోస్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునః పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో అమలవుతున్న రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాల విద్యార్థులు, మాల ఉద్యోగులు నష్టపోతున్న పరిస్థితిని ప్రభుత్వం సమీక్షించాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాలలకు జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాల్లో కులం పేరు స్పష్టంగా లేకపోవడం సమస్యగా మారిందని తెలిపారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటికీ ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రాల్లో గాని, మీ సేవల్లో గానీ "మాల" అనే పేరు కనిపించకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అధ్యక్షులు జాల శ్రీనివాస్, సైదాపూర్ మండల నాయకులు విరంగి సాయి, హుస్నాబాద్ జై భీమ్ సైనిక దళ్ అధ్యక్షులు దుండ్రా సుమన్, హుస్నాబాద్ మండల నాయకులు సుంకే రమేష్ తదితర మాల కుల బాంధవులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఉరుగ్వే– ఆస్ట్రియా హాకీ మ్యాచ్

- ప్రారంభించిన మంత్రులు సీతక్క, అజారుద్దీన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 13: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఉరుగ్వే మరియు ఆస్ట్రియా జట్ల మధ్య జరిగిన మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ను రాష్ట్ర మంత్రులు సీతక్క, అజారుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మంత్రి సీతక్క ఇరు జట్ల క్రీడాకారిణులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. క్రీడా స్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, ఈ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో మహిళల హాకీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధునిక క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తెలంగాణలో నిర్వహించడం ద్వారా రాష్ట్రం అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని అన్నారు. మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. క్రీడలు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని ఆమె అన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీలను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలోని తొలి క్రీడ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏటీజీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్ సింగ్, క్రీడా శాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్‌కొరత లేదు

- కొరత పేరుతో బ్లాక్ దందా చేస్తే కఠిన చర్యలు
- రంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా, మార్చి 13: రంగారెడ్డి జిల్లాలో ఎల్పీజీకి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్లో ఎల్పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సిలిండర్ పంపిణీకి ఎటువంటి అంతరాయాలు లేకుండా యథావిధిగా కొనసాగడానికి తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. కొరత పేరుతో బ్లాక్ దందా చేస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రారెడ్డి హెచ్చరించారు. గ్యాస్ కోసం వచ్చే వినియోగదారులతో డీలర్ల వద్ద పనిచేసే వ్యక్తులు మంచిగా మాట్లాడాలని, ఉన్న విషయాన్ని తెలుపాలన్నారు. వినియోగదారులు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసుకోవద్దని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి వనజాతరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజకీయం



రష్యా నుంచి చమురు కొనవద్దని ఇండియాను అమెరికా కొన్నినెలలపాటు బెదిరించింది. ఇరాన్‌తో రెండు వారాల యుద్ధం తర్వాత ఆ పరిస్థితి మారింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ఇండియాతో సహా మిగతా దేశాలను యూఎస్ వేడుకుంటోంది. ఇరాన్‌పై వార్‌కు మద్దతిస్తే రష్యాకు వ్యతిరేకంగా యూఎస్‌సపోర్ట్ తమకు లభిస్తుందనుకున్న యూరప్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

\- ఇరాన్ ఫారిన్ మినిస్టర్ అరఘ్చి

ఓపెన్ వాయిస్

కామన్ సివిల్ కోడ్‌కు లైన్ క్లియర్

యూనిఫైడ్ కామన్ సివిల్ కోడ్ దేశంలో అమలు చేసేందుకు కేంద్రం చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. కానీ, విపక్షాలు తరచూ అడ్డుకుంటున్నాయి. తాజాగా సుప్రీం కోర్టు ఈ చట్టం అమలు ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేసింది. ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతున్న 1937 నాటి షరియత్ చట్ట నిబంధనలను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో ఉమ్మడి పౌర స్మృతి అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, ఈ కేసులో మహిళలకు ఆస్తి వారసత్వంలో వివక్ష జరుగుతోందన్న వాదనతో ఏకీభవిస్తూనే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను శాసనసభకే వదిలివేయడం ఉత్తమమని పేర్కొంది. సుప్రీంకోర్టు 1937 షరియా చట్టం ముస్లిం మహిళల ఆస్తి హక్కుల్లో వివక్ష సృష్టిస్తోందనే పిటిషన్‌పై ఈ వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్త ఏకీకృత పౌర చట్టం అమలు అత్యవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ చట్టాన్ని కొట్టివేస్తే చట్ట శూన్యత ఏర్పడుతుందని, శాసనసభ చర్యలు తీసుకోవాలని సూచించింది. షరియా నిబంధనలు మహిళలకు పురుషులతో పోలిస్తే తక్కువ వాటాను కేటాయిస్తాయి. ధర్మాసనం ఈ వివక్షను గుర్తించి, సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం ముస్లిం మహిళలు పొందుతున్న హక్కులను కోల్పోకుండా రక్షించాలని సీజేఐ సూర్యకాంత్ హెచ్చరించారు. భారత వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలనే వాదనను కోర్టు తిరస్కరించింది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాల ప్రకారం యూసీసీ అమలు పార్లమెంటు బాధ్యత అని ధర్మాసనం పేర్కొంది. గతంలో కోర్టులు యూసీసీ సిఫారసు చేశాయి, కానీ శాసనాధికారులు స్పందించకపోవడం ఆందోళనకరం. ఒకే భార్యా నిబంధన అన్ని వర్గాలకు వర్తింపకపోవడాన్ని జస్టిస్ బాగ్చీ ఎత్తిచూపారు. ఈ సమానత్వం లేకపోవడం పౌరుల మధ్య విభేదాలకు దారితీస్తోంది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో యూసీసీ అమలుకు ఒత్తిడి పెరుగుతుంది. షరియా చట్టం మహిళల ఆర్థిక భద్రతను బలహీనపరుస్తూ, ఆధునిక సమాజంతో పోలికలేని అసమానతలు కలిగిస్తోంది. ఈ న్యాయపరమైన శూన్యత దూరం కాకపోతే, మతపరమైన చట్టాలు రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా మారతాయి. అందుకే యూసీసీ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే సంస్కరణల పట్ల ఉన్న ఆతురతలో ముస్లిం మహిళలు ఇప్పుడు పొందుతున్న హక్కులను కూడా కోల్పోయే పరిస్థితి రాకూడదని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యలన్నింటికీ 'యూనిఫాం సివిల్ కోడ్' ఒక్కటే శాశ్వత పరిష్కారమని, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దీనిని రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసిందిఇదే పిటిషన్ విచారణ సందర్భంగా మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చీమాట్లాడుతూ.. 'ఒక పురుషుడికి ఒకే భార్య' అనే నిబంధన ప్రస్తుతం అన్ని వర్గాలకు సమానంగా వర్తించడం లేదని, ఇటువంటి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, షరియత్ చట్టాన్ని కొట్టివేసి భారత వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలని కోరగా, కోర్టు దానిని సున్నితంగా తోసిపుచ్చింది. కోర్టులు గతంలో కూడా అనేకసార్లు యూసీసీని తీసుకురావాలని సిఫార్సు చేశాయని, ఈ విషయంలో పార్లమెంటు తన విజ్ఞతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ప్రకారం, పౌరులందరికీ ఒకే రకమైన పౌర స్మృతి ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనివల్ల మతం, కులంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలలో అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది. ఇది జాతీయ సమైక్యతను, లింగ సమానత్వాన్ని పెంచుతుందని మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే, మైనారిటీల మత స్వాతంత్ర్యం సాంస్కృతిక హక్కులకు భంగం వాటిల్లుతుందని, మెజారిటీల ఆధిపత్యం పెరుగుతుందని వ్యతిరేకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవా వంటి కొన్ని రాష్ట్రాల్లో UCC అమలులో ఉంది. UCC అమలులో ఉన్న అతి పెద్ద సవాళ్లు, వివిధ మత సమాజాల నుంచి వస్తున్న తీవ్ర ప్రతిఘటన, దేశంలోని విభిన్న సాంస్కృతిక వైవిధ్యం. ముఖ్యంగా, ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్, 1937 లోని కొన్ని నిబంధనలు, లింగ వివక్ష చూపుతున్నాయని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 లకు విరుద్ధమని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
14.03.2026

నదులు జన జీవనాడులు

భారతీయ సంస్కృతిలో నదులకు గల ప్రాధాన్యత విస్మరించలేము. అభివృద్ధిలో నదులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయనే వాస్తవాన్ని మరువలేము. భారత దేశంలో అపారమైన జల సంపద ఉన్నా, ఇంకా త్రాగునీటి కోసం, సాగు నీటి కోసం కొట్లాడుకోవడం, జల వివాదాలు తలెత్తడం విచారకరం. వర్షా కాలంలో నగరాలన్నీ జలమయమై పోతుంటే, వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో బెంగళూరు నగరంలో తలెత్తిన నీటి కొరత సమస్యను తలచుకుంటే ఇప్పటికీ భయంగానే ఉంటుంది. హైదరాబాద్ నగరం కూడా వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా త్రాగునీటి సమస్య ఏర్పడడం చూస్తున్నాం. ఎందుకు ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి? నీటి విషయంలో ఎందుకింత నిర్లక్ష్యం ప్రదర్శింపబడుతున్నది? ఎవరు ఇందుకు బాధ్యులు? ఈ సమస్య కు పరిష్కారమేమిటి? అనే విషయంపై లోతైన పరిశీలన అవసరం.



సుంకకవల్లి సత్తిరాజు
9704903463

అపారమైన జల సంపద సముద్రాల పాలవుతుంటే, చుక్కనీరు కూడా త్రాగడానికి పనికి రాని పరిస్థితుల్లో సముద్రాల్లోకి పోతూ వృథాగా మారుతున్న జల సంపదను సంరక్షించి, మానవాళి ప్రయోజనాల కోసం వినియోగించాలి. ప్రపంచాన్ని నీటి కొరత సమస్య పట్టిపీడిస్తున్నది. భారతీయ నగరాల్లో వేసవి వస్తే నీటి సంక్షోభం తారా స్థాయికి చేరుతుంది. సాగు నీటి సమస్య మాత్రమే కాకుండా అత్యవసరమైన త్రాగునీరు కూడా భూమిపై మృగ్యమయ్యే పరిస్థితులు దాపురించడం మానవ తప్పిదమే. ఎన్నో నదులు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. నదులపై నిర్మించే ఆనకట్టలు పర్యావరణానికి నష్టం చేకూర్చరాదు. నదుల వలన భూతలం సస్యశ్యామలమై విరాజిల్లుతున్నది. నదులు నాగరికతకు, సంస్కృతికి ప్రతీకలు. మానవ నాగరికత నదుల వద్దే పరిఢవిల్లింది. జీవవైవిధ్యానికి, జీవ మనుగడకు నదుల సంరక్షణ అత్యంతావశ్యకం. పారిశ్రామిక వ్యర్థాలతో, మానవ దుశ్చర్యలతో కలుషితమైపోతున్న నదులను శుభ్రంగా ఉంచడం, త్రాగునీటి సరఫరాకు, సాగునీటికి అనుకూలంగా నదులను సంరక్షించడం కోసం తగిన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగడమే మార్చి 14 వ తేదీన "నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ" దినోత్సవ ప్రధాన లక్ష్యం. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యంలో నదులు కీలక భూమిక పోషిస్తున్నాయి. అంతర్జాతీయ నదుల కార్యాచరణ దినోత్సవం నదుల పట్ల మానవ విధ్వంస కార్యకలాపాలను అరికట్టడానికి అవగాహన కల్పిస్తున్నది. నదులు జన జీవనాడులు. నదులను కాలుష్యం నుండి కాపాడడం మనందరి కర్తవ్యంగా భావించాలి. 1997 మార్చి 14 వ తేదీన బ్రెజిల్ లోని కురిటిబా లో మొట్టమొదటి సారి నదుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ కార్యాచరణ సదస్సు జరిగింది. ఈ ఏడాది జరిగే అంతర్జాతీయ నదుల కార్యాచరణ వేదిక ప్రజలకు, అంతర్జాతీయ సమాజానికి, ప్రభుత్వాలకు విలువైన సందేశం అందించాలి. ముఖ్యంగా నదుల్లోని నీటిని సంరక్షించి, సాగు నీటికి, త్రాగునీటికి వినియోగించాలి. ఈ సకల చరాచర జగత్తులో జీవకోటి మనుగడకు ప్రాణాధారం 'నీరు'. నీరు లేనిదే జీవరాశి మనుగడ దుర్లభం. అలాంటి నీటివనరులను తరిగి పోకుండా చూడడమే కాకుండా నేటి కలుషిత వాతావరణంలో మనకందరికీ పరిశుభ్రమైన నీరు విధిగా అందించవలసిన బాధ్యత ప్రపంచ సమాజంపై ఎంతైనా ఉంది. కలుషితాలతో నిండిన నీటి స్థానంలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలి. కలుషిత నీటివల్ల రోగాల బారిన పడుతున్న ప్రజలను రక్షించవలసిన గురుతరమైన బాధ్యత ప్రపంచ ఆరోగ్యసంస్థపైన, ప్రభుత్వాల పైన ఎంతైనా ఉంది. ఈనాటికీ ప్రపంచ జనాభాలో అత్యధిక శాతం మందికి స్వచ్ఛమైన త్రాగునీరు అందడం లేదు. ఇక ఇతర అవసరాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కొన్ని దేశాల్లో ఈనాటికీ సరైన త్రాగు నీరు లేదు. సింగపూర్ లాంటి ధనిక దేశాలు నీటికోసం మలేషియా వంటి దేశాలపై ఆధారపడుతున్నాయి. భవిష్యత్తులో నీటిలభ్యత మరింత జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని దేశాల్లో అనేక నదులున్నా, నదీజలాల వినియోగంలో చిత్త శుద్ధి లేక నిరుపయోగంగా మారుతున్నాయి. సముద్రాల్లోకి నదీజలాలు వృథాగా పోతున్నాయి. పెరిగిన జనాభాతో పాటుగా కాలుష్యం కూడా విపరీతంగా



పెరిగిపోతున్నది. పెరుగుతున్న పారిశ్రామీకరణ వలన జల వనరులు, జల మార్గాలు కూడా కాలుష్య భరితంగా మారుతున్నాయి. మానవ జీవితంలో నీరు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. నదీ పరివాహక ప్రాంతాల్లోనే నాగరికత పరిఢవిల్లినట్లు, అభివృద్ధి జరిగినట్టు తేటతెల్లమవుతున్నది. నదుల గురించి అవగాహన కలిగించడం, నదుల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి అనేక చర్యల ద్వారా జనజీవితాలకు, ఇతర జీవరాశులకు మేలు చేయడం కోసం బృహత్తర కార్యచరణతో ముందుకు సాగాలి. ప్రపంచంలో ఎన్నో నదులున్నాయి. నైలు నది, మిసిసిపి, హోయాంగ్ హో, అమెజాన్, కాంగోలు ప్రపంచంలో ప్రఖ్యాత నదులు. ప్రపంచంలో పొడవైన నది నైలునది, రెండవది అమెజాన్. ప్రపంచంలో మూడవ పొడవైన, ఆసియాలో మొదటి పొడవైన నది యాంగ్జీ. ఈజిప్టులో అధికశాతం ప్రజలు నైలునదీ పరివాహక ప్రాంతాల్లో జీవిస్తారు. నైలునదిని "ఈజిప్టు వరప్రసాదం" గా పిలుస్తారు. "ఫాదర్ ఆఫ్ ఆఫ్రికన్ రివర్స్" గా పిలవబడే నైలునది 10 దేశాల గుండా ప్రవహిస్తుంది. చైనా దుఃఖదాయిని గా హోయాంగ్ హో నది (ఎల్లోనది) పిలవబడుతున్నది. మిస్సోరి, మిసిసిపి, యూకోన్ నదులు అమెరికాలో పొడవైన నదులు. ఓల్గా, నేవా, ఓబ్ నదులు రష్యాలో ప్రముఖ నదులు. ప్రపంచంలో ఒక్క నదికూడా లేని దేశం సౌదీ అరేబియా. ఖతార్ లో నదులు, సరస్సులు లేవు. భారత దేశం నదులకు పుట్టినిల్లు. 250 మిలియన్ల హెక్టార్ల ఆయకట్టు 10 కి పైగా ప్రధాన నదులకు చెందుతుంది. భారత దేశ నదీ వ్యవస్థ త్రాగునీటికి, సాగునీటికి, విద్యుత్, రవాణాకు అనుకూల మైనది. భారత దేశంలో గంగ, సింధు, గోదావరి, కృష్ణానదులు ప్రసిద్ధి చెందినవి. సింధునది అత్యంత పొడవైన నదిగా పేరొందినా, ఈ నదీ ప్రవాహం ఎక్కువగా పాకిస్తాన్ లో ఉంది. ఇటీవల భారత్ సింధుజలాలను పాక్ లోకి ప్రహహించకుండా నిలుపుదల చేసింది. భారత దేశంలో గంగానది ఎక్కువ పరిధిని కలిగి ఉంది. సంవత్సరం పొడవునా ప్రవహించే నదులను జీవనదులు లేదా శాశ్వత నదులు అంటారు. గంగ, యమున, తపతి, బ్రహ్మపుత్ర, నర్మద తదితర నదులన్నీ జీవనదులు. రాజస్థాన్ లోని లూనీ నది ఏ సముద్రం లోను కలవదు. సముద్రాల్లో కలవని నదుల లోని నీరు ఇసుకలోనే ఇంకి పోతుంది. ప్రతీ మనిషికీ త్రాగడానికి, ఇతర అవసరాలకు సరిపడా కనీస నీటిని కూడా మనం అందించలేకపోతున్నాం. పరిశుభ్రమైన త్రాగునీరు అందించకపోవడమే నీటికారక వ్యాధుల విజృంభణకు మూల కారణం. మరో దశాబ్దం నాటికి నీటి అవసరాలు మరింత పెరుగుతాయి. మనకు నదులు, సరస్సుల రూపంలో నీటి వనరుల లభ్యత ఉంది. కాని అనేక రకాల కారణాల వల్ల మనం నీటివనరులను సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నాం. నీరంతా వృథాగా సముద్రం పాలవుతుండడం బాధాకరం. సరైన అవగాహన, చైతన్యం లేకపోవడమే దీనికంతటికీ ముఖ్య కారణం. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడమే కాకుండా సమీప భవిష్యత్తులో అందరికీ పరిశుభ్రమైన మంచినీటిని అందించి ప్రజలను రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించే దిశగా మన అడుగులు ముందుకు పడాలి. నదుల్లో ఏర్పడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలి. ప్రపంచ నదుల పరిరక్షణకు పటిష్ఠమైన అంతర్జాతీయ కార్యాచరణ ప్రణాళిక అవసరం. నదీజలాల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తూసుకోవాలి. నదులను కాలుష్య రహితంగా మార్చాలి. నదుల ప్రాధాన్యతను చాటిచెప్పడానికి ఉద్దేశించిన "ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ రివర్స్" నదుల ప్రాధాన్యత గురించి అవగాహన కలిగించడంలో, నదులను సంరక్షించడంలో భవిష్య తరాలకు మార్గ నిర్దేశనం చేయాలని ఆశిద్దాం.

(మార్చి 14, ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ రివర్స్)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో
నష్టపోయేది ఓబీసీ కులాలు మాత్రమే!




సొప్పరి నరేందర్
9553958648

దేశంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం EWS ఎకనమికల్లీ వీకర్ సెక్షన్స్ రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ రిజర్వేషన్ ద్వారా సాధారణ వర్గాలకు చెందిన ఆర్థికంగా బలహీన కుటుంబాలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం కోటా కల్పించబడింది. అయితే ఈ నిర్ణయం పై పలు వర్గాలు ముఖ్యంగా OBC సమాజం చాలా నష్టపోయింది. EWS రిజర్వేషన్ లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయడమే అయినా దీనివల్ల వెనుకబడిన OBC వర్గాలపై చాలా ప్రభావం చూయించింది. భారత రాజ్యాంగానికి 2019లో 103వ సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించింది. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి జాతీయ విద్యాసంస్థల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రభుత్వం వారి వార్షిక ఆదాయాన్ని 8 లక్షలుగా నిర్ణయించింది. ఇదంతా కూడా ఎలాంటి శాస్త్రీయత లేకుండా చట్టాలను అతిక్రమిస్తూ చేసిన సవరణ. ఈ సవరణ న్యాయ బద్ధతను సవాలు చేస్తూ జనహిత అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ కోర్టులో సవాలు చేసింది. కేవలం ఆర్థిక పరిస్థితి ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చనేది రాజ్యాంగంలో ఎక్కడ లేదు. M.R బాలాజీ, ఇందిరా సహాని కేసులో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే తీర్పు ఉంది. ఆర్థికంగా వెనుకబడిన సమూహంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ లకు చోటు లేకపోవడం కులవివక్ష అంటూ ఈ స్వచ్ఛంద సంస్థ కోర్టును ఆశ్రయించిం ది. అయితే ఈ సవరణ సబబు అంటూ సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల బెంచ్ 3:2 తేడాతో ఆమోదం తెలుపుతూ తీర్పునిచ్చింది.

3% వారికి 10% రిజర్వేషన్లా..?


కాకా కాలేల్కర్ కమిటీ, మండల్ కమిషన్, వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన బీసీ కమిషన్లు అన్నీ బీసీలు, ఓబీసీల జనాభా 5255 శాతంగా నిర్ధారించాయి. చట్ట ప్రకారం జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల వివరాలు సేకరిస్తున్నారు. అందులో నిర్ధారించిన వారి జనాభాకు అనుగుణంగా వరుసగా 15 శాతం 7.5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సమూహంలో వీళ్లను మినహా 77.5 శాతం, మిగిలిన 22.5 వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ 22.5 శాతంలో 1.5 శాతం ముస్లింలు ఉన్నారు. ఈ



15 శాతం ముస్లింలలో 2019 నుంచి ఇప్పటి వరకు 0.5 శాతం మంది కూడా విద్యా, ఉద్యోగావకాశాలు పొందలేకపోయారు. అంటే 7.5 శాతం మందికి ఈడబ్ల్యుఎస్ నుంచి ముస్లింలని మినహాయిస్తే 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సబబే అంటూ ఈ న్యాయమూర్తులు అన్యాయమైన తీర్పునిచ్చారు. ఈ ఏడున్నర శాతం ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు అంటే 8 లక్షల లోపు ఆదాయం ఉన్నవాళ్లు రెండున్నర శాతానికి మించి ఉండరు. దీనివల్ల మూడు శాతం వారికి పది శాతం రిజర్వేషన్లు అదనంగా దోచి పెట్టడమే..

40 శాతం కోటాకే పోటీ పడాలా..?

కులాల వారీగా బీసీల లెక్కింపునకు పార్లమెంటులో హామీ ఇచ్చి వెనక్కితగ్గిన కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు ఎలాంటి అధికారిక లెక్కలు లేకుండా ప్రజల్లో చైతన్యం పెరగాలి. ఆధిపత్య కులాలకు ఆస్తులతో పాటు విద్యా, ఉద్యోగాలు కూడా దోచి పెట్టే ప్రయత్నం చేస్తున్నది. నిజానికి 50 శాతం ఓపెన్ కోటాలో పోటీ పడాల్సిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఇప్పుడు 40 శాతం కోటాలోనే పోటీపడాల్సి ఉంటుంది. జనాభాలో 55 శాతంగా ఉన్న ఓబీసీలకు కేవలం వారి జనాభాలో సగం మందికి 27 శాతం రిజర్వేషన్లు అమలుజేస్తున్నారు. అదీ క్రీమిలేయర్ లాంటి షరతుల మధ్య 1993 నుంచి ఇప్పటి వరకు రిజర్వేషన్లు గంపగుత్తగా 50 శాతానికి మించకూడదంటూ ఎం.ఆర్.బాలాజీ, ఇందిరా సహానీల కేసులో సుప్రీం కోర్టు తీర్పులిచ్చింది. క్రీమీలేయర్ అమలు కారణంగా మిగిలిపోయిన ఉద్యోగాలను ఓపెన్ కోటాలోకి మళ్లించి బీసీలకు అన్యాయం చేశారు. ఉద్యోగాల అమలు అంతా ఆధిపత్య కులాల చేతులోనే ఉంది కాబట్టి 1993 నుంచి ఇప్పటి వరకు దాదాపు 30 ఏండ్లుగా రైల్వేల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మరోవైపు సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లకు భిన్నంగా కేవలం ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కొంతమంది నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల రిజర్వేషన్ విధానాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.



సకలశాస్త్రాలకు మూలం గణితం



సుధాకర్.ఏ.వి
9000674747

గణితం.. పేరు వినగానే అందరూ భయపడతారు. దీనికి మాత్రం ప్రత్యేకమైన స్థానం ఉంది. లెక్కలతో జీవితం ముడిపడి ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఇందులో రాణిస్తే భవిత మీదే అంటారు నిపుణులు. ఈ అంశంలో పరిణతి సాధిస్తే దీనితో ముడిపడి ఉండే భౌతిక, రసాయన శాస్త్రాల్లో సులభంగా దూసుకెళ్లవచ్చు. పోటీ పరీక్షల్లో గట్టెక్కవచ్చు. వ్యాపారాల్లో రాణించవచ్చు. ఇలా అన్నింటితో సంబంధం ఉన్న లెక్కలను జీవితానికి అన్వయించుకుంటే సాఫీగా పోవడం ఖాయం. గణితంలో వాడే గుర్తు పేరు "పై" (π). దీని విలువ 22/7 అంటే 3.14159 ఈ విలువ ఆధారంగా గణిత శాస్త్రవేత్తలు, మేధావులు ప్రతీ సంవత్సరం మూడవ నెల 14వ తేదిన "పై డే" గా జరుపుకుంటారు. 1988లో పై డేను మొట్టమొదటిసారిగా పెద్ద వేడుకగా శాన్ ఫ్రాన్సిస్కో ఎక్స్‌ప్లోరేటోరియంలో లారీ షా నిర్వహించాడు. అక్కడ షా భౌతిక శాస్త్రవేత్తగా పనిచేసేవాడు. ఈ వేడుక కోసం అక్కడి పనిచేస్తున్న సిబ్బంది, ప్రజలు అక్కడి వృత్తాకార ప్రదేశాలలో ఒకదాని చుట్టూ కవాతు చేస్తూ, ఆపై పండ్లతో చేసిన "పై" (pie)లు తిన్నారు. ఎక్స్‌ప్లోరేటోరియంలో పై డే వేడుకలు ఇప్పటికి కొనసాగుతూనే ఉన్నాయి. 2009 మార్చి 12 న అమెరికా ప్రతినిధుల సభలో 2009 మార్చి 14 ని జాతీయ పై దినోత్సవంగా గుర్తిస్తూ తప్పని సరి కాని తీర్మానానికి ఆమోదం లభించింది. 2010లో పై దినోత్సవం సందర్భంగా గూగుల్ ఒక ప్రత్యేకమైన డూడుల్‌ను ప్రదర్శించింది, ఇందులో "GOOGLE" అనే పదం వృత్తాలు, పై చిహ్నాల చిత్రాలపై ఉంచబడింది. గణిత స్థిరాంకం పైకి (π) గౌరవ సూచకంగా దీనిని రూపొందించారు. కొందరు 2014 మార్చి (3/14) మొత్తాన్ని "పై నెల"గా పాటించారు. 2015 సంవత్సరంలో, మార్చి 14ను "సూపర్ పై డే"గా జరుపుకున్నారు. దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఈ తేదీని అమెరికన్ ఫార్మాట్ (నెల/రోజు/సంవత్సరం) లో 3/14గా రాస్తారు, ఇది π (పై) విలువ 3.14ను సూచిస్తుంది. ఇంకా ప్రత్యేకంగా, 3/14/15 నాడు, ఉదయం 9:26:53 గంటలకు, తేదీ, సమయం కలిసి 3.141592653 అనే π మొదటి పది అంకెలను సరిగ్గా సూచిస్తాయి. ఈ రెండవ సంఖ్య, "పై ఇన్‌స్టంట్" π అన్ని అంకెలను సూచిస్తుంది.

మార్చి 14 గణిత దినోత్సవం

(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్ధంగా అమలు చేస్తున్నాం

- కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీలో మంత్రి వివేక్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోకుండా కొనసాగిస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభావంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు.శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు రూ.3 కోట్లు 42 లక్షల 39 వేల విలువైన 342 కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సిద్దిపేటలో సమర్ధంగా అమలు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లిస్తున్నామని, ముందస్తు అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించినవారికి కూడా త్వరలో అనుమతులు ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు, నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ, ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించనున్న సమ్మిట్ ఫలితాలు, 119 అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాలు ద్వారా యువతకు శిక్షణ అందించడం, సిద్దిపేట మున్సిపాలిటీలో రూ.18 కోట్లతో అభివృద్ధి పనులు మొదలైన అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సిద్దిపేట ఆర్డీవో సదానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఘనంగా కవిత పుట్టినరోజు వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 13: మెదక్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక నాయకుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని కవిత దీర్ఘాయుష్షు కలిగి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు మెదక్ పట్టణంలో ఉత్సాహభరితంగా జరిగాయి.



నెలనెలా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

- గ్రామపంచాయతీ కార్మికుల మొర
- గజ్వేల్ బీఆర్ఎస్ ఇంచార్జికి వినతి పత్రం

ప్రతిపక్షం, గజ్వేల్ (మనోహరాబాద్) మార్చ్ 13: రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్మికులకు పాత విధానంలోనే నెలనెల జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని నిడదీయాలని కోరుతూ శుక్రవారం నాడు మనోహరాబాద్ మండల కేంద్రంలోని మనోర హోటల్ వద్ద గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనీ 12 వేల 729 గ్రామపంచాయతీలలో 60 వేల మందికి పైగా గ్రామపంచాయతీ కార్మికులకు దాదాపు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించలేదని వెంటనే పారిశుధ్య కార్మికులకు సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు కోటీశ్వరులు కారని , గ్రామాలలో పట్టణాలలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ అనునిత్యం ప్రజలకు సేవలో ఉంటున్న పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు, కార్మికులు జీతాలు రాక అల్లాడిపోతున్నారని, తినడానికి కూడా ఇబ్బందిగా ఉందని తెలిపారు, పరిశుద్ధ కార్మికుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చెలగాటమాడం తగదన్నారు. బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే కార్మికులకు చెల్లించాలని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, వివిధ గ్రామాల సర్పంచులు మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లన్న హుండీ ఆదాయం

రూ.1 కోటి 20 లక్షలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 13: కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి ఖజానాకు భక్తులు హుండీలలో వేసిన కానుకలతో హుండీ ద్వార రూ.1,20,29,945ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్వామి వారి ఆలయ ముఖ మండపంలో ఆలయంలోని 28 రోజుల హుండీలను దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, లలిత సేవాసమితి సభ్యులు లెక్కించారు. ఈసందర్భంగా నగదు రూ.1, 20, 29, 945 లు, మిశ్రమ బంగారం 89 గ్రాములు, మిశ్రమ వెండి 6 కిలోల 100 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు 34 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంగం నర్సింహరెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, మల్లేశం, ఆలయ ఏఈఓలు బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, స్థానచార్యులు మల్లయ్య, ఆలయ సిబ్బంది పర్యవేక్షకులు చంద్రశేఖర్, స్వర్ణకారుడు నర్సింహచారి, లలిత సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



రైతు భరోసా అమలు చేయాలి

- యూరియా యాప్ తొలగించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు రక్షణ సమితి నాయకులు డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు పంటలకు మాత్రమే రైతు భరోసా ఇచ్చి, మిగిలిన మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వకపోవడం ద్వారా రైతులను చిన్నచూపు చూస్తోందని రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో రైతు సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా అధ్యక్షులు మారెడ్డి రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్న రైతులకు అన్ని పంటలకు సమానంగా భరోసా కల్పించే విధంగా రైతు భరోసా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న యూరియా యాప్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎరువుల కొనుగోలులో సాంకేతిక సమస్యలు తలెత్తుతూ రైతులకు ఇబ్బందులు కలుగుతున్నందున యూరియా యాప్‌ను వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి ప్రోత్సాహం కల్పించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు రైతు సంఘాల నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పోతుగంటి వెంకట్రాంరెడ్డి,బైరవ రెడ్డి, శ్రీరాం రెడ్డి, రవీందర్ రెడ్డి,భూపతిరెడ్డి, యధం రావు, రామచందర్ రావు,పులి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సరఫరా లో కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: సిద్దిపేట జిల్లాలో గృహ అవసరాలతో పాటు కేజీబీవి లు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాలకు వంట గ్యాస్ సరఫరా లో ఎలాంటి కొరత రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కె. హైమవతి గ్యాస్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఎల్పీజీ గ్యాస్ డీలర్లు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జరుగుతోందని, ఇదే విధంగా భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు యుద్ధ వాతావరణంలో ఉన్నప్పటికీ ఇతర దేశాల నుండి ఇంధనం దిగుమతి చేసుకుని ప్రభుత్వం సరఫరా చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాధాన్యత గల గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు గ్యాస్ సరఫరా నిరంతరం కొనసాగాలని ఆదేశించారు.ఇవే కాకుండా గృహ అవసరాలకు కూడా గ్యాస్ కొరత లేకుండా సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ పనితీరును పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారికి తెలియజేయాలని తెలిపారు. గ్యాస్ స్టాక్ మరియు డెలివరీ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని, రెవెన్యూ, సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఒక్క సిలిండర్ తేడా వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, డీఈఓ శ్రీనివాసరెడ్డి, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, డీడబ్ల్యూఓ శారద, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

- ఆరుగురు జూదరుల అరెస్టు

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 13: పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా పోలీస్ అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. చేగుంట మండలం బోనాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారాన్ని అందుకున్న టాస్క్ ఫోర్స్ అధికారులు దాడి చేసి మాడుగుల అరుణ్ కేదారి చంద్రం చుట్టం వెంకటేష్ పారా ప్రవీణ్ గోపాటి పెంటయ్య మచ్చ శ్రీకాంత్ లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 57 వేల 830 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని చేగుంట పోలీసులకు అప్పగించారు. పేకాట రాయుళ్ల సమాచారాన్ని అందించడానికి 100 నెంబర్ కు డయల్ చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.



మెదక్‌లో గ్యాస్ వినియోగదారుల కష్టాలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 13: మెదక్ లో గ్యాస్ వినియోగదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గ్యాస్ కొరత లేదని చెబుతున్నా, సిలిండర్ కోసం ఏజెన్సీల వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు. ఫోన్ బుకింగ్ కాకపోవడం, ఓటీపీ సమస్యలు, ఇరాన్ యుద్ధ ప్రభావం వంటి కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో డోర్ డెలివరీ చేయడం లేదని, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కలెక్టర్‌ను సన్మానించిన టీయూడబ్ల్యూజే బృందం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ,మార్చి 13: మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ ను టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి ఆధ్వర్యంలో జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి డైరీ అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, యూనియన్ సీనియర్ నాయకులు, జర్నలిస్టులు ఫరూక్ హుస్సేన్, మురళీధర్, ఖయ్యుం, రాజశేఖర్, లక్ష్మినారాయణ, నర్సింలు, అల్లాడి శేఖర్, కృష్ణమూర్తి, ముజీబ్ తదితరులున్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడింది కేసీఆరే!

- మహిళలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎక్కడ?
- నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి



ప్రతిపక్షం, గజ్వేల్ (జగదేవ్ పూర్) మార్చి 13: మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో బిఆర్ఎస్ మండల మహిళా విభాగం కొత్త కవిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మండల విభాగం మహిళా నాయకురాలకు, మహిళా మణులకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీలు ఎక్కడ పూజించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని తెలిపారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే మహిళా మూర్తుల పాత్ర అత్యంత కీలకమన్నారు, మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గోదావరి జలాలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన సురక్షితమైన త్రాగు నీరును అందించి మహిళలను రోడ్ల మీదకి రాకుండా చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. మహిళలకు భరోసాగా మేనమామ కానుకగా మహిళలను ఆడబిడ్డలను గౌరవిస్తూ కల్యాణ లక్ష్మి పథకం తీసుకొచ్చి పెళ్లి చేసుకున్న ప్రతి ఆడ బిడ్డకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసిన ఘనత కేసీఆర్ ది అన్నారు. అంతేకాకుండా గర్భిణీ స్త్రీలకు మంచి పౌష్టికాహారం అందించడం కోసం న్యూట్రిషన్ కిట్టు, తల్లి పిల్లలకు కావలసిన సామాన్లను కెసిఆర్ కిట్టు అందించారన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్, ఒంటరి మహిళలకు దేశంలోనే మొట్టమొదటిసారిగా పెన్షన్లను అందజేసిన ఘనత కేసీఆర్ ది అన్నారు. అదే కాకుండా వితంతువులకు వృద్ధులకు, వికలాంగులకు నేరుగా పెన్షన్లను వారి ఖాతాలో జమ చేసిన ఘనత గత ముఖ్యమంత్రి అన్నారు. అలాగే రాష్ట్రంలో చదువుకునే పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, మైనార్టీ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థినిలకు కావలసిన వసతులను కల్పించి నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్లో నాణ్యమైన భోజనాన్ని అందించిన ఘనత కేసిఆర్ ది అన్నారు. నేడు అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు మోసం చేసిందన్నారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వడంలో, చదువుకున్న ప్రతి విద్యార్థినికి స్కూటీల పంపిణీ లో, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు ఒంటరి మహిళలకు సైతం పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి, మండల కో ఆప్షన్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్, మండల పరిషత్ భవనాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ కు నార్సింగ్ సర్పంచ్ సుజాత వినతి



ప్రతిపక్షం, చేగుంట, మార్చి 13: మెదక్ జిల్లాలో నార్సింగ్ మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడిచిన ప్రభుత్వ భవనాలు అద్దె భవనాలు కొనసాగుతున్నాయని పర్మనెంట్ భవనాలకు నిధులు మంజూరు చేయాలని నార్సింగ్ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ కు వినతి పత్రం అందజేశారు. పోలీస్ స్టేషన్ భవనంతో పాటు మండల పరిషత్ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని సుజాత వివరించారు. అలాగే జూనియర్ కళాశాల భవనం ప్రాథమిక పాఠశాల భవనం అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఇతర ప్రభుత్వ భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎన్ఆర్ఏజిఎస్ పథకం ద్వారా 20 లక్షలు మంజూరయ్యాయని అదనంగా మరో 20 లక్షలు మంజూరు చేస్తే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మండల కేంద్రంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ ప్రతిమ సింగ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

“



వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో నంబర్ వన్ ప్లేస్‌లో ఉంది. ఈ క్రమంలో రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు ఎగుమతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్‌లపై అధికారులు దృష్టి సారించాలి. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడేలా గ్రేడింగ్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, నాణ్యతా ప్రమాణాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రాంతీయం

పదో తరగతి విద్యార్థులకు హరీశ్‌రావు శుభాశీస్సులు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థినీ, విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామని, విద్యాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి అవసరమైన అన్ని వసతులు కల్పించామని తెలిపారు.విద్యార్థులు కష్టపడి చదివారని, వారి కష్టం వృథా కాదని అన్నారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. అందువల్ల ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు, ఉపాధ్యాయుల కృషిని సార్థకం చేయాలని కోరారు. విద్యార్థులకు ఉత్తరాలు పంపడం, టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం ద్వారా వారిని ప్రోత్సహించామని తెలిపారు. విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందించి విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



ఏడుపాయలలో గ్యాస్ కొరత

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 13 :- ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్యాస్ కొరత తీవ్రంగా మారింది ఈ కొరత వల్ల దేవాలయంలో సైతం పడింది ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం వద్ద గ్యాస్ కొరత ఏర్పడడంతో గ్యాస్ రాకపోవడంతో వన దుర్గ మాత అమ్మవారి ప్రసాదము భక్తులకు ఇవ్వడానికి ఆలయ సిబ్బంది లడ్డు. పులిహోర తయారీకి గ్యాస్ కొరత ఉండడంతో కట్టెలపై పోయి పైన తయారు చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ హాస్టల్స్ దేవాలయాలకు ఆగి పోయిన కమర్షియల్ గ్యాస్ సరఫరా ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏడుపాయలకు వచ్చే భక్తులకు లడ్డు పులిహోర అందించాలని ఉద్దేశంతో కట్టెల పొయ్యి పైన తయారుచేసి సకాలంలో అందిస్తున్నామని ఆలయ కమిటీ ఈవో వీరేశం తెలిపారు.



సిద్దిపేటలో కవిత జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి 13: సిద్దిపేట పట్టణంలోని ఇందిరా నగర్‌లో ఉన్న మనస్ఫూర్తి ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా జాగృతి నాయకులు సిద్దరబోయిన శ్రీనివాస్, వరికోలు శ్రీనివాస్, గౌస్మియా ఆధ్వర్యంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధుల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి, అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. కవిత జన్మదిన సందర్భంగా వృద్ధులు ఆమెకు ఆశీర్వాదాలు అందించి, ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా జాగృతి నాయకులు సిద్దరబోయిన శ్రీనివాస్ (మిట్టపల్లి మాజీ ఎంపీటీసీ), వరికోలు శ్రీనివాస్, గౌస్మియా, బాసం గారి జోగిరెడ్డి, ఎండి జాతీయ బేగం, తోట పద్మ, రేణుక, నెల్లుట్ల లక్ష్మి, బంజర్‌పల్లి అనిత, లతా, ఖాజాబీ, బోనగిరి మంజుల, సురేష్, మన్య యాదగిరి, రాయపురం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఉదారత చాటుకున్న యువకుడు

- స్వంత ఖర్చులతో పరీక్షా సామాగ్రి అందజేత
- మగ్దుంపూర్ పదో తరగతి విద్యార్థులకు సాయం
- టాటా ఏసీ డ్రైవర్ మానవత్వం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 13: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతలు మిన్న. కాయకష్టం చేసి సంపాదించిన దాంట్లో కొంత పేద విద్యార్థుల కోసం ఖర్చు చేసి ఓ యువకుడు తన ఉదారతను చాటుకున్నాడు. టాటా ఏస్ వాహనాన్ని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ముద్రబోయిన మహేశ్ తన కష్టార్జితంలో కొంత ఖర్చు చేసి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించారు. నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహేశ్ సిద్దిపేటలో టాటా ఏస్ వాహనాన్ని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న 24 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు జీడిపల్లి సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, దుద్దెడ పరశురాములు, దీకొండ గోవర్ధన్, ఆదిరాల సాయినాథ శర్మ, ముస్లి రాజయ్య, తడకంటి రాజు, రాంపూర్ మాజీ సర్పంచి అనగోని పరశు రాములు గౌడ్, రాంపూర్ ఉప సర్పంచి బొడిగె తిరుపతి గౌడ్, గోవిందారం స్వామి, శివరాత్రి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత ముద్రబోయిన మహేశ్ మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1,000ల నగదు బహుమతి ఇస్తానని చెప్పారు. రాంపూర్ ఉప సర్పంచి బొడిగె తిరుపతి మాట్లాడుతూ 550పైన మార్కులను సాధించే విద్యార్థులకు వారి మార్కులకు మార్కులు సమ సంఖ్యలో నగదు బహుమతిని అందిస్తానని తెలిపారు.

గందరగోళం వద్దు.. కావలసినంత గ్యాస్ ఉంది

- గ్యాస్ సరఫరాపై అపోహలు పడకండి
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 13 : మెదక్ జిల్లాలో గ్యాస్ కొరత లేదని ప్రజలు గందరగోళం గురికా వద్దని కావాల్సినంత గ్యాస్ అందుబాటులో ఉందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు తో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికాఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని.ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని కలెక్టర్ తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటుఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు ,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆమె తెలిపారు. జిల్లా ప్రజలకు అవసరమైన మేరకు గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రజల గృహ అవసరాలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్లు అందిస్తామని వివరించారు. గ్యాస్ సిలిండర్ల లభ్యతపై ప్రజలెవరు ఆందోళన చెందవద్దని, ఎట్టి పరిస్థితుల్లో అసత్య వార్తలను నమ్మవద్దని ఆమె ప్రజలను కోరారు. జిల్లాలో 16 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరపర చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలో అన్ని ఏజెన్సీల ద్వారా మూడు లక్షల 84 వేల 373 కలెక్షన్ లు ఉన్నాయి ఆమె అన్నారు. ఎవరైనా కమర్షియల్ గ్యాస్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా బ్లాక్ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు సివిల్ సప్లై అధికారులు కలిసి నర్సాపూర్లో 47 గ్యాస్ సిలిండర్లను పట్టుకోవడం జరిగిందని తదుపరి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్,... జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు ,మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, జిల్లా పౌరసరపాల అధికారి నిత్యానంద్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



10 వ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు

- మండల విద్యాధికారి గంగాబాయి

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 13: శనివారం నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు నార్సింగ్ మండల విద్యాధికారి గంగాబాయి తెలిపారు. నార్సింగ్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మండలంలోని పరీక్ష సెంటర్ల ద్వారా 137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు టీ కొట్టులు కిరాణా షాపులు ఇతర వ్యాపార సంస్థలు మూసివే విధంగా పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్ తాసిల్దార్ గ్రేసు బాయ్ తో కలిసి ఎంఈఓ గంగా బాయ్ సమావేశమయ్యారు.



నంగునూర్ ప్రధాన కాలువలో పూడిక తొలగింపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: నంగునూర్ మండలానికి వెళ్లే ప్రధాన కాలువలో తుంగ, పూడిక తొలగింపు పనులను అధికారులు ప్రారంభించారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టారు. ఇటీవల కాలువలో తుంగ, పూడిక ఎక్కువగా పేరుకుపోవడంతో రైతులకు సకాలంలో సాగునీరు అందక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయంపై రైతులు తెలియజేయడంతో హరీష్ రావు పై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే లాంగ్ బూమ్ మిషన్ ఏర్పాటు చేసి కాలువలో ఉన్న పూడికను తొలగించాలని ఆదేశించారు.ఆయన ఆదేశాల మేరకు అధికారులు లాంగ్ బూమ్ మిషన్ సహాయంతో కాలువ శుభ్రపరిచే పనులను ప్రారంభించారు. దీంతో నంగునూర్ మండల రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు .ఈ చర్యపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలి

ప్రతిపక్షం, మిరుదొడ్డి, మార్చి 13: ప్రభుత్వ ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ మహేశ్వరి దేవరాజ్ సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించి ఉచిత మేగా ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేద, బడుగు, బహీన వర్గాల ప్రయోజనార్థం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని చెప్పారు. చికిత్స కంటే నివారణ సులువు అన్నారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట మెడికల్ కలశాలకు చెందిన వైద్యనిపుణులు లీలా, శ్రావణి, తరుణ్, ప్రసాద్, వెంకటసాయి వైద్యాసేవ లు అందించగా వైద్యాధికారి సమీనా సుల్తానా, సిబ్బంది లింగమూర్తి, శ్రీనివాస్, నరేష్, అనిరాధ, రవీందర్, విజయ, స్వప్న, స్వర్ణ, అనసూయ, పద్మ, నర్సమ్మ వివిధ గ్రామాలకు చెందిన ఆశ వర్కర్స్ పాల్గొన్నారు. 334 మందికి పరిక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.



స్త్రీ శిశు సంక్షేమమే మా లక్ష్యం!

- ఐసీడీస్ సీడీపీఓ ఎల్లయ్య

ప్రతిపక్షం,తొగుట, మార్చ్ 13: మాతా శిషు సంరక్షనే లక్ష్యంగా అంగన్వాడీ లు పనిచేస్తున్నాయని దుబ్బాక ఐ సి డి స్ సీడీపీఓ ఎల్లయ్య పేర్కొన్నారు..ఐసీడీఎస్, రిలయన్స్ ఫౌండేషన్, క్రై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకట్రావుపేట లో గురువారం రాత్రి గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ అధ్యక్షతన ఊరు మన అంగన్వాడీ కార్యక్రమం పై కళాజాత కార్యక్రమం నిర్వహించారు ఈసందర్బంగా అంగన్వాడీలో అందించే వివిధ రకాల సేవలపై, ముఖ్యంగా పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన పెంపొందించడానికి కళాకారుల చేత ఆటలు, పాటలు మరియు నాటికల రూపంలో ప్రదర్శించారు.. ఈసందర్బంగా ఎల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడీలోనే 3 నుండి 6 సంవత్సరాల వయస్సు పిల్లలను చేర్పించి, ప్రతీరోజు వారిని అంగన్వాడీకి పంపించి వారి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. మన గ్రామంలో ప్రతి గర్భిణీ తల్లి ఆరోగ్యంగా ఉండాలి, ప్రతి బిడ్డ సురక్షితంగా మరియు ఆరోగ్యంగా ఎదగాలి అనే లక్ష్యంతో మనం కలిసి పనిచేయాలని గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ కోరారు..అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు గ్రామ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైనవని, మాతా-శిశు సంక్షేమం బలపడితేనే సమాజం బలపడుతుందని, అందరం కలిసి ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.. కార్యక్రమం లో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిది సుదర్శన్, క్రై ఫౌండేషన్ భాస్కర్, ఐసీడీస్ సూపర్వైజర్లు ప్రతిభ, గిరిజలతో పాటు వార్డు సభ్యులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీబీ తనిఖీలు

- మెడికల్ రియంబర్స్ మెంట్ బిల్లులపై
- ఏసీబీ తనిఖీల్లో నిగ్గుతేలిన నిజాలు





ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 13 : మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ రియంబర్స్ మెంట్ బిల్లుల జాప్యంపై ఏసీబీ తనిఖీల్లో నిజాలు నిగ్గు తేలాయి. ఫైల్ ల కదలిక నిబంధన మేరకు జరగడం లేదని, ఇన్వార్డ్ నమోదు మినహా ఫైళ్ళ ఔట్ వార్డు వివరాలు లేవని ఏసీబీ తనిఖీలో తేలింది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ రియంబర్స్ మెంట్ సూపరింటెండెంట్ లతీఫ్ ముజాహిద్దీన్ పై జరిగిన ఏసీబీ తనిఖీలు పూర్తయ్యాయి. శుక్రవారం మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం డి.ఎస్.పి మీడియాతో మాట్లాడుతూ. మెడికల్ రియంబర్స్ మెంట్ సూపరింటెండెంట్ లతీఫ్ ముజాహిద్దీన్ బిల్లులు ఫార్వర్డ్ చేయడం లేదంటూ వచ్చిన సమాచారం ఆధారంగా తనిఖీలు చేశారు. గత యేడు సెప్టెంబర్ లో బాధ్యతలు తీసుకున్న లతీఫ్ ముజాహిద్దీన్ వద్దకు 284 రాగా 116 బిల్లులు పంపాల్సి ఉండగా పంపలేదు. బిల్లుల మంజూరు లో తృణమో ఫానమో లేనిది బిల్లులు కావడం లేదంటూ వచ్చిన సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. బిల్లులకు సంబంధించి ఇన్వార్డ్ వివరాలు ఉన్నా ఔట్ వార్డు వివరాలు లేనట్టు ఏసీబీ తనిఖీలో తేలింది. సూపరింటెండెంట్ వద్దకు వచ్చిన బిల్లులను చేసి నేరుగా ఇచ్చినట్టు గుర్తించారు. ఫైళ్ళ కదలిక సక్రమంగా జరడంలేదని గుర్తించినట్టు చెప్పారు. మెడికల్ రియంబర్స్ మెంట్ బిల్లుల సక్రమంగా పాస్ కావడం లేదన్న సమాచారంతోనే సోదాలు చేశామని, పూర్తి నివేదిక సంబంధిత మెడికల్ హెడ్ ఆఫీస్ లో అందజేస్తామని తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత ను కూడా అధికారులు విచారించారు. ఏసీబీ తనిఖీలలో ఏసీబీ సీఐ వెంకట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మూసీ పునరుద్ధరణ కోసం దుబాయ్, సింగపూర్, లండన్, సియోల్ వంటి నగరాల్లో పర్యటించి అక్కడి నదీ అభివృద్ధి నమూనాలను స్టడీ చేశాం. ఇతర దేశాల అభివృద్ధి వేగాన్ని అందుకోవడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు చేపట్టాం. నిజాం కాలంలోనే చార్మినార్ చుట్టూ స్పెషల్ ఎకనమిక్ జోన్‌ను ఏర్పాటు చేసి నగరాన్ని అభివృద్ధి చేశారు. అదే స్ఫూర్తితో మూసీ తీరాన్ని తీర్చిదిద్దుతాం.
- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాంతీయం

గ్యాస్ సిలిండర్ల విషయంలో ఆందోళన వద్దు

- జిల్లా అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి
- పర్యవేక్షక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెల్లడి
- అక్రమాలకు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- విద్యా సంస్థలు, ఆసుపత్రులకు ఇండెంట్ అందిన వెంటనే గ్యాస్ సరఫరా చేయాలి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 13 : వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో ప్రజలు ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, జిల్లాలో గ్యాస్ కొరత ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యవేక్షక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో వంట గ్యాస్ డిమాండ్, సరఫరా తీరుతెన్నుల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, 33 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని, శుక్రవారం నాటికి 10,850 సిలిండర్లు జిల్లాలో గృహావసరాల కోసం పంపిణీ నిమిత్తం అందుబాటులో ఉన్నాయని, వీటికి అదనంగా మరో 5,875 సిలిండర్లు జిల్లాకు రానున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సిలిండర్ బుక్ చేసిన వారికి మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గృహావసరాల సిలిండర్లు పంపిణీ చేయబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎల్.పీ.జీ సిలిండర్ల పంపిణీని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే, నిత్యావసర సరకుల చట్టం, 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే తనిఖీలను ముమ్మరం చేయించామని, ప్రస్తుత మార్చి నెలలో ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు ఆకస్మిక దాడులు జరిపిన సందర్భంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 156 డొమెస్టిక్ సిలిండర్లను వివిధ వ్యాపార, వాణిజ్య దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారని కలెక్టర్ వివరించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలకు, ఆసుపత్రులకు, అంగన్వాడీ కేంద్రాలకు, అనాథ్రాశ్రమాలకు ఇండెంట్ లు అందిన వెంటనే జాప్యానికి తావు లేకుండా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు, రోగులు, వారి అటెండెంట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని అన్నారు. ఆసుపత్రులలో ఇన్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగానే సిలిండర్లు ఇండెంట్ పెట్టేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని డీ.ఎం.హెచ్.ఓను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత ఎంతమాత్రం లేదని అన్నారు. ఎల్.పీ.జీ వినియోగదారులు ఆన్లైన్లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని, ఏజెన్సీల వద్దకు, గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లవద్దని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఎ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.టీ.ఓ ఉమామహేశ్వర్ రావు, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.డబ్ల్యూ.ఓ పద్మ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఆర్ సీ ఓ లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, ఎల్.పీ.జీ డీలర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా

- తల్లీకొడుకు సహా నలుగురు దుర్మరణం
- 15 మందికి తీవ్ర గాయాలు
- ఆసుపత్రికి తరలింపు
- గన్నారం వద్ద ఘటన



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 13 : జిల్లాలోని ఇందల్వాయి మండలం గన్నారం వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన బస్సు బోల్తా ప్రమాదంలో తల్లి కొడుకు తో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కన్నతల్లి వెచ్చని ఒడిలో సేదతీరు తున్న ఆ ఏడేళ్ల పసివాడికి, అదే తన చివరి నిద్ర అని తెలియదు పాపం. ఈ ఘటనకు సంబంధించి ఇంద ల్వాయి ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి అకోలా వైపు ప్రైవేటు బస్సు బయలుదేరింది. బస్సులో డ్రైవర్ తో సహా మొత్తం 22 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు రాత్రి సుమారు 2 గంటల సమయంలో గన్నారం వద్దకు చేరుకోగానే, డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని నడపడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సైన్ బోర్డులను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. దాంతో నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా హాహాకారాలు చేస్తూ బస్సులో ఇరుక్కుపోయారు. ప్రమాదంలో మహారాష్ట్ర కు చెందిన మంజూష (30), ఆమె ఏడేళ్ల కుమారుడు రిషి, బెంగుళూరు కు చెందిన అబ్బాస్(45), రాహుల్ (30) మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో 11 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మరో నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సందీప్ వెల్లడించారు.



నేడు మహ్మదపూర్ అమరవీరుల 78వ వర్ధంతి

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న చాడ వెంకటరెడ్డి
- -సభను జయప్రదం చేయాలని సీపీఐ పిలుపు

-ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 13: తెలంగాణ సాయుధ పోరాట యోధులు, అమరజీవి అనభేరి ప్రభాకర్‌రావు సహా 12 మంది వీరుల 78వ వర్ధంతి సభను నేడు శనివారం హుస్నాబాద్ మండలం మహ్మదపూర్‌లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, పేదలకు భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఈ వీరుల స్మారకార్థం నిర్వహించే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.1948 మార్చి 14న మహ్మదపూర్ గ్రామ సమీపంలోని భూషణగట్ల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రథమ కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు సింగిరెడ్డి భూపతి రెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, బి.దామోదర్ రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారాం, చిక్కోడు సాయిలు, రొండ్ల మాధవరెడ్డి వీరమరణం పొందారని ఆయన గుర్తు చేశారు. శనివారం ఉదయం మహ్మదపూర్‌లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మహ్మదపూర్ గుట్టల్లో ఉన్న వారి సమాధుల వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించనున్నట్లు మల్లేశ్ వెల్లడించారు. అనంతరం నిర్వహించే సంస్మరణ సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ zకన్వీనర్ జాగీర్ సత్యనారాయణ పాల్గొంటారు.



ప్రజాపాలనను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 13: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అడ్లూర్-ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ అధికారుల ద్వారా అడ్లూర్ శివారులో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేసి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హైవే పైన ఉన్న అన్ని డాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి, వారికి సంబంధిత లైసెన్సులు ఉన్నాయా లేదా, అలాగే నేషనల్ హైవే అధికారుల అనుమతి తీసుకున్నారా లేదా అనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రయాణికులు , ప్రజలు నేషనల్ హైవే పైన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్, ఫుడ్ వేస్టేజ్, పేపర్ వేస్టేజ్ వంటి చెత్తను వేయకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ గవిజ్ఞప్తి చేశారు. ఈ దిశగా గ్రామపంచాయతీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీవోలు సంయుక్తంగా తనిఖీ చేసి, నేషనల్ హైవే అనుమతులు , గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. హోటళ్ల నుండి వచ్చే చెత్తను రోడ్డుపై వేస్తే సంబంధిత గ్రామపంచాయతీలు అధిక మొత్తంలో జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు.

హత్యారాజాకీయాలను అస్సలు సహించబోం

- ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి
- మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి హత్య అత్యంత దురదృష్టకరం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే
- దోషులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశం
- రేపు స్వగ్రామంలో ఇమ్మడి గోపి అంత్యక్రియలు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 13 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధి ఇందల్వాయి మండలం లింగాపూర్ గౌరారం శివారులో జరిగిన మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి దారుణ హత్య దురదృష్టకరమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి అన్నారు. హత్యకు గురైన ఇమ్మడి గోపి పార్థివదేహాన్ని గురువారం సాయంత్రం వారి గ్రామానికి వెళ్లి సందర్శించారు. ఆయన పార్థివదేహం వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ రాష్ట్రస్థాయి నాయకుడు ఇమ్మడి గోపి హత్య వార్త తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు.పార్టీలో చురుకుగా పాల్గొంటూ bతన గెలుపు కోసం పనిచేశారని స్మరించుకున్నారు. బుధవారం రాత్రి పదిగంటల ప్రాంతంలో ఈ ఘటన జరగగా, అప్పటి నుండే నగర సిపి ద్వారా వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకున్నట్లు తెలిపారు. దోషులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టాలని పోలీసులకు తెలిపారు. తెలంగాణలో హత్యారాజకీయాలను అస్సలు సహించేది లేదన్నారు. కాగా ఇమ్మడి గోపి అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామం గౌరారం గ్రామ పంచాయతీ లింగాపూర్ లో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఇందల్వాయి, డిచ్ పల్లి మండలాల పార్టీ అధ్యక్షులు నవీన్ గౌడ్, అమృతాపూర్ గంగాధర్ ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి

- జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 13: రాష్ట్రంలో హిందూ, ముస్లిం మత ప్రజలు గంగాయమున తహజీబ్ కలిసికట్టుగా జీవించాలి అని జిల్లా ఇంచార్జి మంత్రి జి. వివేక్ వెంకటస్వామి శుక్రవారం ప్రకటించారు.ముస్లింల కోసం రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో షాదీ ఖానా, కబరిస్తాన్ ఏర్పాటుకు ఒక్కో ప్రాంతానికి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లింల కోసం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. సిద్ధిపేటలో కబరిస్తాన్ సమస్యపై వెంటనే చర్యలు తీసుకుంటామని, మైనార్టీ శాఖ మంత్రితో చర్చించి, ముస్లింలకు అవసరమైన స్థలాలను సేకరించి కుట్టు మిషన్ అందజేస్తామన్నారు. గత ఎన్నికల్లో ముస్లీం మైనార్టీలు ప్రభుత్వం కు మద్దతు ఇచ్చినందున, మైనార్టీ సంక్షేమం కోసం ప్రభుత్వ ప్రాధాన్యం కొనసాగుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.



మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు

- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 13: మతసామరస్యానికి మారుపేరుగా గజ్వేల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర సాధనలో నిలిచిందని గజ్వేల్ మదీనా మజీద్ ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక మదీనా మజీద్ ఆవరణలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న హరీష్ రావు మాట్లాడుతూ పండుగలు ప్రతి సంవత్సరం వస్తు పోతుంటాయి కానీ దీక్షతో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ప్రతి ఒక్కరు తమ తమ కట్టుబాట్లను చాటుతూ ఉపవాస దీక్షలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో కులమత, బీద గొప్ప తారతమ్యాలు లేకుండా సోదర భావంతో మెలుగుతూ దేశంలోని తెలంగాణ అన్ని రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలవాలని హరీష్ రావు కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు నవాజ్ మీరా, మున్సిపల్ నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగరావు, గంగిశెట్టి రవి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవి రవీందర్, జాఫర్ ఖాన్, విరాసత్, బొగ్గుల సురేష్ మైనారిటీ మత పెద్దలు పాల్గొన్నారు.



ఉత్తమ రైతులుగా అవార్డులు అందుకున్న 'పట్టు' రైతులు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చి 13: కేంద్ర పట్టు పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా లోని బోదాన్ పోచంపల్లి లో జరిగిన రాష్ట్రస్థాయి పట్టు కృషి మేళాలో సిద్దిపేట జిల్లాలోని ఉత్తమ పట్టు రైతులకు జిల్లాస్థాయి అవార్డులను అందజేసి శాలువాలతో సన్మానించారు. ఉత్తమ రైతులుగా బొగ్గుల వనజ నరసింహులు, పిల్లి సునీత శ్రీనివాస్, రాగుల లక్ష్మీరాజు, ఇరుకొండ వాణి నారాయణరెడ్డి లు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. ఉత్తమ చాకి సెంటర్ నిర్వాహకుడిగా పెద్దోళ్ల నరసింహులు అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత, శాస్త్రవేత్తలు వినోద్ కుమార్, రాఘవేంద్రరావు, భువన తదితరులు హాజరై పట్టు సాగులోని మెలకువలను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను, ప్రోత్సాహకాలను, పంట దిగుబడితో వచ్చే లాభాలను వివరించారు. అనంతరం ఉత్తమ పట్టు రైతులను వారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ సంచాలకులు ఇంద్రసేనారెడ్డి, అధికారులు ఐలయ్య, మల్లేశం, వివిధ జిల్లాల అధికారులు,రైతులు పాల్గొన్నారు.



శేష వాహనంపై నాచగిరి నరసింహుడు

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చ్ 13: వర్గల్ మండలం నాచారంగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాడు శేష వాహనంపై లక్ష్మీ సమేతుడై, నరసింహ స్వామి భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఈ సందర్భంగా పుణ్యక్షేత్రంలోని పురవీధుల్లో ఊరేగిస్తూ సభ మండపం పైన స్వామివారి ఆశీనులు గావించి భక్తులు భజన , భక్తి పాటలను ఆలపించారు. కార్యక్రమంలో అశేష భక్తజనులతో పాటు ఆలయ చైర్మన్ చైర్మన్ రవీందర్ గుప్త, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి బి రంగాచారి, సభ్యులు, ఉష రాజశేఖర్ శర్మ, కొత్తపల్లి శ్రీనివాస్ ఆలయ సిబ్బంది సుధాకర్, గజ్వేల్ సంతోషిమాత సేవా సమితి సభ్యులు మరియు నాచారం భజన మండలి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 13: మెదక్ జిల్లాలో మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 BNSS అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పరీక్షల రోజుల్లో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరడం నిషేధమన్నారు.కేంద్రాల సమీపంలో సమావేశాలు, ర్యాలీలు, మైకులు వినియోగించడం అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయనున్నట్లు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.





రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ధాన్యం సేకరణ జరిగిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే ₹6 వేలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం ₹14 వేలు కలిపి ఏటా ప్రతి రైతు ఖాతాలో ₹20 వేలు జమ చేస్తున్నాం. తాను కూడా రైతు బిడ్డనే. వారి కష్టాలు తనకు తెలుసు. అందుకే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం



కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పాండురంగారెడ్డి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 13: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని, నగరంలోని వారి నివాస కార్యాలయంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కప్పాటి పాండురంగారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి వరకు సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ జాగృతి, ఇప్పుడు ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. "తెలంగాణ అస్థిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన కవితమ్మ, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాజకీయ రంగంలోకి అడుగు పెట్టుతుండడం హర్షణీయం అని అన్నారు. త్వరలోనే తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుంది" అని పాండురంగారెడ్డి అన్నారు.

గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక తెలంగాణ

- ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కేసిఆర్ పెద్దపీట
- పటాన్ చెరు లో గత 27 సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం హర్షనీయం
- మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ.
- సబ్బండ వర్గాల సంక్షేమమే మా లక్ష్యం
- అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధం నిలిచిపోవాలని అల్లాను ప్రార్థించండి
- ముస్లింల సంక్షేమానికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 13 : గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక తెలంగాణ రాష్ట్రమని దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేసిన మహోన్నత నేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ అన్నారు. గత 27 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కే దక్కిందని ప్రశంసించారు. క్రవారం సాయంత్రం పటాన్ చెరు పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మహమ్మద్ అలీ తో పాటు, శాసనమండలి మాజీ ప్రోటైం చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహమూద్ అలీ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని ముస్లింల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి మరువలేనిదని అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ గొప్ప సెక్యులర్ వాదిగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నిలిచిపోతున్నారని అభినందించారు. సొంత నిధులతో ఆశిర్ఖానాలు, మసీదులు, దర్గాలు నిర్మించడం అభినందనీయమన్నారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం ముగిసిపోయేలా అల్లాను ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో పుష్కలంగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలంతా సుభిక్షంగా, సుఖ: సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని కోరారు. నియోజకవర్గంలో కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముస్లింలకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



విద్యార్థులపై దాడి ఘటనపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

- కళాశాల గుర్తింపు రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 13 : మొయినాబాద్‌లోని గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులపై ఫిర్యాదు చేసిన విద్యార్థులపై యాజమాన్యం కక్ష సాధింపుతో వైస్ ప్రిన్సిపాల్ అహ్మద్ జీషన్, సహాయకుడు మల్లేష్ దాడి చేశారని ఆరోపించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

- చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి
- చేవెళ్ల 12వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 13: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం 12వ వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో కౌన్సిలర్ అతెల్లి మనీషా అనంతరెడ్డితో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని కోరారు. పరిశుభ్రతపై ప్రజలు అవగాహనతో సహకరిస్తేనే పట్టణం స్వచ్ఛంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా మరిన్ని వస్తాయి

- గీతం కాంక్లేవ్ లో పరిశ్రమ నిపుణులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 13 : కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తృత వినియోగం వల్ల తొలి దశలో కొన్ని ఉద్యోగాలు పోయినా, మున్ముందు మరిన్ని అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఏఐ స్థానభ్రంశం చేయవచ్చని, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులో వస్తాయని అంచనా వేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) ఆధ్వర్యంలో 'భవిష్యత్తును ఇంజనీరింగ్ చేయడం: ప్రధాన రంగాలలో ఆవిష్కరణలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన మూడవ దఫా ఇండస్ట్రీ కాంక్లేవ్ విజయవంతంగా ముగిసింది. రానున్న రోజులలో ఉద్యోగ మార్కెట్ విస్తరిస్తూనే ఉంటుందని, అయితే ఏఐ ఆధారిత యుగానికి తగిన నైపుణ్యాలను విద్యార్థులు సమకూర్చుకోవాలని నిపుణులు సూచించారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ లు, పరిశ్రమల సందర్శన, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా తమ జ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరచుకోవాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, ముఖ్యంగా రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారిన ఏఐపై పట్టు సాధించాలని ప్రోత్సహించారు. సాంకేతిక నైపుణ్యాలు, జ్ఞానానికి మించి నియామకాలలో 75 శాతం విజయానికి ఆయా అభ్యర్థుల ప్రవర్తన, వైఖరి కారణమని వారు స్పష్టీకరించారు. కోర్ ఇంజనీరింగ్ కు పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై గీతం యాజమాన్యాన్ని అభినందించారు. దీనివల్ల పరిశ్రమవిద్యాసంస్థల మధ్య అంతరం తగ్గి అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ఎన్ఎక్స్‌పీ సెమీకండక్టర్స్ లో ఇండియా ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అధిపతి ప్రీత్ యాదవ్, స్టెల్లాంటిస్ లో డెలివరీ లీడ్ సుమన్ గోర్లా ముఖ్య అతిథులుగా పాల్గొని, కీలకోపన్యాసాలు చేశారు 'వ్యూహాత్మక మార్పు: హార్స్ పవర్ నుంచి కంప్యూట్ పవర్'కు అనే అంశంపై నిర్వహించిన రెండో ప్యానెల్ చర్చలో డ్రోనవేషన్ ఇండస్ట్రియల్ ఏఐ డ్రోన్ సీఈవో డాక్టర్ సౌరభ్ శ్రీవాస్తవ; ఎంఓసార్ట్స్ సీటీవో డాక్టర్ ఎ. కృష్ణకాంత్; అనలాగ్ పోర్ట్ లో అనలాగ్ ఇంజనీరింగ్ డైరెక్టర్ వై. షమీర్; బాష్ ఫంక్షనల్ ఎక్సలెన్స్ లీడ్ వంశీ మగపు; గ్లోబల్ ఫౌండ్రీస్ ఎస్ఎంటీఎస్ డిజైన్ ఇంజనీర్ ప్రియాంకర్ మాథురియా పాల్గొన్నారు. దీనిని గీతం బీటెక్ (ఈఈసీఈ) మూడో ఏడాది విద్యార్థిని పర్ణిక సురేష్ సూరిసెట్టి సమన్వయం చేశారు. 'సాంకేతిక నైపుణ్యాలకు మించి సామర్థ్యాలను పెంపొందించడం: కోర్ ఇంజనీరింగ్ లో అవకాశాలు' శీర్షిక జరిగిన మూడో ప్యానెల్ చర్చలో బాష్ యూనివర్సిటీ రిలేషన్స్ ప్రణీత్ సరన్; స్టెల్లాంటిస్ లోని టాలెంట్ అక్విజిషన్ లీడ్ నిషితా రాయ్ పాల్గొనగా, సీజీసీ ప్రతినిధి ఎల్. వంశీకృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ప్యానలిస్టులు గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలను సందర్శించారు. అధునాతన అభ్యాసం, పరిశోధనలకు మద్దతుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలను ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని వారు అభినందించారు. తొలుత, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు స్వాగతోపన్యాసం చేయగా, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సూచించారు. సీజీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.వాసుదేవ్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఇందులో సీజీసీ డైరెక్టర్ డాక్టర్ కె. మమతారెడ్డి, కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు పూర్తి ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43. 007 విద్యార్థులు పరీక్ష రాబోతున్నారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హనుమకొండలో 12079. వరంగల్ లో 9492. జనగామలో.6445. మహబూబాబాద్ లో 8157. భూపాల్ పల్లిలో 3544. ములుగు లో 3290. విద్యార్థులు రాయనున్నారు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు జరగనున్నాయి.



గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 13 : మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ గ్రామ పశు వైద్యశాలలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ దేవీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని రైతులు తమ పశువులను తీసుకువచ్చి టీకాలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవీ రెడ్డి మాట్లాడుతూ... పశువుల్లో గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



శాండ్విక్ పరిశ్రమలో సీఐటీయూ ఘనవిజయం

- హెచ్ఎంఎస్ పై 131 ఓట్లతో భారీ విజయం
- మరోసారి విజయకేతనం ఎగురవేసిన కార్మికుల వేగు 'చుక్క'
- కార్మిక శ్రేయస్సే సిఐటియు లక్ష్యం
- ఈ విజయం మరింత బాధ్యతను పెంచింది
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 13 : కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిన శాండ్విక్ పరిశ్రమ లో సిఐటియు ఘన విజయం సాధించింది. పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు, హెచ్ఎంఎస్ పై 131 ఓట్ల భారీ విజయం సాధించి మరోసారి స్వగర్వంగా విజయకేతనం ఎగురవేసింది కార్మికుల వేగుచుక్క సీఐటీయూ తరఫున రాష్ట్ర అధ్యక్షులు పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు. హెచ్ఎంఎస్ తరఫున విశ్వ ప్రసాద్ బరిలో ఉన్నారు. పరిశ్రమలో మొత్తము 186 ఓట్లు గాను సిఐటియుకు 157, హెచ్ఎంఎస్ కు 26 ఓట్లు రాగ 2 ఓట్లు వేయలేదు. హెచ్ఎంఎస్ పై సిఐటియు 131 ఓట్లతో భారీ విజయం సాధించింది. ఈ సందర్భంగా పరిశ్రమ లోపలి నుంచి జాతీయ రహదారి వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మికులు రంగులు పూసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ విజయోత్సవం జరుపుకున్నారు.

ఈ విజయం కార్మికుల విజయం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు శాండ్విక్ పరిశ్రమ విజయం కార్మికుల విజయమని, విజయం మరింత బాధ్యతను పెంచిందని, ఇది కార్మికుల విజయంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అభివర్ణించారు. కార్మిక వర్గాన్ని చీల్చటానికి ఎన్ని కుయుక్తులు పన్నిన కార్మిక వర్గం ఐక్యంగా నిలిచి కుట్రలను పటాపంచలు చేస్తూ మరోసారి చారిత్రాత్మక విజయనందించారని కొనియాడారు. కార్మికులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చనేది ఈ శాండ్విక్ విజయమే ఒక నిదర్శనం అన్నారు. ఈ విజయంలో పాలు పంచుకున్న కార్మికులందరికీ ఈ విజయం అంకితం చేస్తూ కార్మికులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలోనే చారిత్రాత్మక విజయమని పరిశ్రమంలో గత 41 సంవత్సరాలుగా కార్మికుల కోసం చట్టపరమైన సౌకర్యాలు సాధించుకుంటూ జిల్లాలోని మిగతా యూనియన్లకు ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. వివిధ పరిశ్రమల కార్మిక సంఘం నాయకులు చుక్క రాములకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భద్రకాళి చెరువు పూడికతీతకు శ్రీకారం

- రూ.16.10 కోట్లతో పనుల ప్రారంభం
- అభివృద్ధిపై రాజకీయాలు చేయొద్దు
- భద్రకాళి ఆలయాన్ని జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే నాయిని రెడ్డి ఫైర్



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 13 : వరంగల్ నగర అభివృద్ధిలో కీలకమైన భద్రకాళి చెరువు పునరుద్ధరణకు మరోసారి శ్రీకారం చుట్టామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. గతంలో రూ.9 కోట్లతో ప్రారంభించిన పూడిక తీత పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ఇప్పుడు రూ.16.10 కోట్ల నిధులతో సమగ్రంగా చెరువు పూడికతీత పనులను చేపడుతున్నామని నాయిని చెప్పారు శుక్రవారం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రకాళి సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ నగర మేయర్ గుండు సుధారాణిలతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ఎలాంటి అంతరాయాలు లేకుండా చెరువు పునరుద్ధరణ, మాడ విధుల పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా ఓటు బ్యాంకు రాజకీయాలు చూడలేదని స్పష్టం చేశారు ప్రతిపక్ష పార్టీ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలు జరిగితే తమకు చెడ్డపేరు వస్తుందనే భయంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు సమిష్టి నాయకత్వంతో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని వెల్లి నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు అలాగే భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా ఆలయం నుంచి బండ్ వైపు గ్లాస్ వంతెన ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా భక్తులు వచ్చి దర్శించుకునేలా భద్రకాళి ఆలయాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు గత పాలకులు అమ్మవారి పేరును రాజకీయ లబ్ధికి వినియోగించుకున్నారని, తమ అనుచరులకు ఆలయ పరిసరాల్లో వ్యాపార సంస్థలు ఇచ్చి రేట్లు పెంచి ప్రజలకు భారంగా మార్చారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు గతంలో 70 ఏళ్ల క్రింద పూడికతీత జరిగిన చెరువును నేడు మళ్లీ మా హయాంలో జరగడం చాలా సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

“



మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి వెనక పెద్ద కుట్ర ఉంది. ఆపరేషన్ కగార్ ప్రారంభం కాగానే నంబాల బాడీగార్డులు లొంగిపోయి ఇన్‌ఫార్మర్లుగా మారారు. కీలక నేతలైన మల్లోజుల, ఆశన్న శత్రువులకు లొంగిపోయి ఆయుధాలు అప్పగించారు. వీరిద్దరూ పార్టీని చీల్చారు. మేము మాత్రం ఆయుధాలను అడవుల్లోనే వదిలేశాం.

- లొంగిపోయిన మావోయిస్టు దేవ్‌జీ

దేశ రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తున్నాం

- కాంగ్రెస్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోంది
- మండిపడిన ప్రధాని మోదీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 13: ఎన్డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి, దేశం స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశం పట్ల తమ నిబద్ధత లోపాన్ని ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. యుద్ధాల వల్ల తలెత్తిన సంక్షోభ సమయాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ తప్పుడు సమాచారాన్ని, అసత్యాలను ప్రచారం చేయడానికే పరిమితమైందని విమర్శించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. అక్కడి నుంచే దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను విడుదల చేశారు. టీ తోట కార్మికులకు భూమి హక్కులను అందించడం ద్వారా అసోంలోని ఎన్డీఏ సర్కార్ ఆ సమాజానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని అంతం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసోంలో అధికారంలో ఉన్నప్పుడు టీ తోట కార్మికులను ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు. భారత్‌ను దశాబ్దాలుగా విదేశాలపై ఆధారపడేలా కాంగ్రెస్ చేసిందని, కానీ ఎన్డీఏ ప్రభుత్వం దానిని క్రమంగా మార్చిందని వెల్లడించారు. తుల కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రధాని మోదీ వివరించారు. కోవిడ్, యుద్ధాలు వంటి ప్రపంచ సంక్షోభాలు దేశ వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపకుండా జాగ్రత్త వహించామని పేర్కొన్నారు. రైతు సోదరులకు ఉపశమనం కలిగించడానికి ఎరువుల సబ్సిడీలు రూ. 12 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రైతుల సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమని నొక్కిచెప్పారు. 2014కు ముందు కాంగ్రెస్ పదేళ్ల పాలనలో కేవలం మద్దతు ధర రూపంలో రూ.6.5 లక్షల కోట్లు రైతులకు చెల్లించగా, తమ దశాబ్ద కాలం పాలనలో అన్నదాతలకు రూ.20 లక్షల కోట్లు అందించామని పేర్కొన్నారు.



విశ్వ వీక్షణం



రాజ్యాంగం ప్రజల గొంతుక గాడ్సే, సావర్కర్లది కాదు

- రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 13: రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్‌స్టీన్ అనే పదాన్ని ఉచ్చరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు. ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్" అని రాహుల్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు. "కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు" అని రాహుల్ విమర్శించారు.



నిజాయితీ అజేయమైనది!

నేటి ఆధునిక కాలంలో మనం ఒక వింతైన వైరుధ్యాన్ని చూస్తున్నాం. ఒకవైపు సాంకేతికత దూసుకుపోతోంది, మరోవైపు విలువలు వేగంగా పతనమవుతున్నాయి. ఈ ఉరుకుల పరుగుల ప్రపంచంలో, గమ్యాన్ని చేరుకోవడానికి అడ్డదారులు తొక్కడం ఒక సాధారణ విషయంగా మారిపోయింది. ఇలాంటి నేపథ్యంలో, నిజాయితీగా జీవించడం వల్ల ఈ కాలంలో విజయం సాధించవచ్చా? అనే ప్రశ్న ప్రతి యువకుడి, ప్రతి వ్యాపారవేత్త మనసులో ఒక నిగూఢమైన సందేహంగా మెదులుతోంది. మన చుట్టూ ఉన్న సమాజంలో అబద్ధాలతో అట్టహాసం చేసేవారు, అవినీతితో మేడలు కట్టేవారు తాత్కాలికంగా మెరుస్తూ కనిపిస్తుండటంతో, నీతిగా బతికే సామాన్యుడికి ఒక్కోసారి నిరాశ కలగడం సహజం.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

కానీ, ఈ పైపైన కనిపించే మెరుపుల వెనుక ఒక చేదు నిజం దాగి ఉంది. నిజాయితీ అనేది కేవలం ఒక నైతిక విలువ మాత్రమే కాదు; అది సుస్థిరమైన విజయాన్ని అందించే అత్యంత శక్తివంతమైన లైఫ్ స్ట్రాటజీ (జీవన వ్యూహం). చాలామంది నిజాయితీ అంటే కేవలం అబద్ధం చెప్పకపోవడం అని మాత్రమే భావిస్తారు. కానీ అది నాణేనికి ఒక పార్శ్వం మాత్రమే. నిజాయితీ అనేది మన అంతరాత్మకు, మన బాహ్య ప్రవర్తనకు మధ్య ఉండే ఒక అందమైన వంతెన. మన ఆలోచనల్లో స్వచ్ఛత, మాటల్లో పారదర్శకత, మరియు చేసే పనుల్లో చిత్తశుద్ధి ఉండటమే నిజమైన నిజాయితీ. మనం ఒక పని చేయగలమంటే చేస్తామని చెప్పడం, చేతకాకపోతే క్షమించండి, ఇది నా వల్ల కాదు అని ముక్కుసూటిగా ఒప్పుకోవడం కూడా నిజాయితీలో భాగమే. ఇతరుల కష్టాన్ని గౌరవించడం, మన తప్పులను సాకులు వెతకకుండా అంగీకరించడం వంటి లక్షణాలు ఒక వ్యక్తిని సమాజంలో ఒక విశ్వసనీయమైన బ్రాండ్ గా నిలబెడతాయి. భారతీయ సంస్కృతిలో సత్యమేవ జయతే అన్న నినాదం ఊరికే పుట్టలేదు. చరిత్ర పుటలు తిరగేస్తే, అబద్ధంపై నిలబడ్డ సామ్రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి కానీ, సత్యం వైపు నిలబడ్డ వ్యక్తులు యుగాల పాటు స్ఫూర్తిప్రదాతలుగా మిగిలారు. మహాత్మా గాంధీ సత్యశోధన నుండి అబ్దుల్ కలాం గారి నిరాడంబరత వరకు, వారంతా నిజాయితీ అనే పునాదిపైనే తమ విజయసౌధాలను నిర్మించుకున్నారు. నిజాయితీ లేని మార్గాల్లో ప్రయాణించేవారు త్వరగా గమ్యాన్ని చేరుకోవచ్చు. ఒక వ్యాపారి నాణ్యత లేని వస్తువును మెరిసే ప్యాకింగ్‌తో అమ్మి రాత్రికి రాత్రే లక్షాధికారి కావచ్చు. ఒక రాజకీయ నాయకుడు సాధ్యం కాని హామీలతో అధికారాన్ని చేజిక్కించుకోవచ్చు. కానీ ఇక్కడ ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి పునాది లేని కట్టడం ఎంత ఎత్తుకు ఎదిగినా, అది కూలడానికి ఒక్క చిన్న కుదుపు చాలు. ప్రపంచ ఆర్థిక చరిత్రలో ఎన్రాన్ వంటి దిగ్గజ సంస్థల పతనం లేదా మన దేశంలో సత్యం కంప్యూటర్స్ కుంభకోణం మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పాయి.

మోసం అనేది ఇసుకపై కట్టిన ఇల్లు లాంటిది. అది చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నా, కాలం అనే తుఫానును తట్టుకోలేదు. అంతేకాకుండా, మోసపూరిత జీవనం గడిపే వ్యక్తి నిరంతరం ఒక అభద్రతా భావంతో బతుకుతుంటాడు. ఒక అబద్ధాన్ని కాపాడుకోవడానికి వంద అబద్ధాలు ఆడాల్సి వస్తుంది. ఈ క్రమంలో కలిగే మానసిక ఒత్తిడి, ఆత్మవంచన మనిషిని లోపల నుండి ఖాళీ చేసేస్తాయి. అపారమైన సంపద ఉన్నా, ప్రశాంతత లేని జీవితం విజయమనిపించుకోదు. నిజాయితీగా ఉంటే నష్టపోతామని అనుకునేవారికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా గురించి ఎంత చెప్పినా తక్కువే. వ్యాపారంలో లాభాల కంటే విలువలకే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. 2008 ముంబై దాడుల సమయంలో టాటా గ్రూప్ తన ఉద్యోగులకే కాక, ప్రాంతంలో ఉన్న సామాన్యులకు కూడా అండగా నిలిచింది. ఒకానొక సమయంలో నైతిక కారణాల రీత్యా కొన్ని లాభదాయకమైన ఒప్పందాలను కూడా వారు వదులుకున్నారు. ఫలితంగా, నేడు టాటా అనే పేరు ఒక నమ్మకానికి చిహ్నంగా మారింది. కోట్ల రూపాయల విలువైన ఆ బ్రాండ్ ఇమేజ్ నిజాయితీ వల్ల వచ్చినదే. పారదర్శకతకు ప్రతిరూపం ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరైన వారెన్ బఫెట్ తన ఇన్వెస్టర్లకు ఇచ్చే సలహా ఒక్కటే మీరు చేసే పని రేపు ఉదయం వార్తాపత్రికలో మొదటి పేజీలో వచ్చినా మీరు గర్వంగా తలెత్తుకునేలా ఉండాలి. ఆయన సంస్థ బెర్నర్ హాథవే దశాబ్దాలుగా నైతికతను వీడకుండా అద్భుతమైన లాభాలను ఆర్జిస్తోంది. అడ్డదారులు తొక్కకుండా కూడా ప్రపంచ కుబేరుడు కావొచ్చని ఆయన నిరూపించారు. నిష్కల్మషమైన మేధావి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన ప్రయాణం ఒక అద్భుతం. దేశ అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ, ఆయన తన వ్యక్తిగత ఖర్చుల కోసం ప్రభుత్వ సొమ్మును వాడలేదు. పదవీ విరమణ సమయంలో కేవలం రెండు సూట్కేసులతో రాష్ట్రపతి భవనం నుండి బయటకు వచ్చిన ఆయన నిజాయితీని చూసి ప్రపంచమే విస్తుపోయింది. అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, కోట్ల మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నిజాయితీగా ఉండటం అంటే కత్తి మీద సాము చేయడమే. ఈ మార్గంలో అనేక సవాళ్లు ఎదురవుతాయి . మీరు నిజాయితీగా ఉన్నప్పుడు, వెంటనే వచ్చే కొన్ని లాభాలను వదులుకోవాల్సి రావచ్చు. ఒక తప్పును ఒప్పుకున్నప్పుడు వచ్చే విమర్శలు లేదా శిక్షలు భయపెట్టవచ్చు. కానీ ఇవి తాత్కాలికం మాత్రమే. అందరూ లంచాలు తీసుకుంటున్నప్పుడు నేను మాత్రమే ఎందుకు నీతిగా ఉండాలి? అనే ఆలోచన రావడం సహజం. ప్రవాహానికి ఎదురీదడం ఎప్పుడూ కష్టమే, కానీ అదే మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. నిజాయితీగా చేసే పనికి ఫలితం రావడానికి సమయం పడుతుంది. తక్షణ ఫలితాలను ఆశించే నేటి ఇన్స్టంట్ జనరేషన్కు ఇది ఒక పెద్ద పరీక్ష. ఇది ఒక రోజులో వచ్చే మార్పు కాదు. దీనిని ఒక అలవాటుగా మార్చుకోవాలి, ఆఫీసులో చిన్న అబద్ధాలు చెప్పకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించడం వంటి చిన్న పనుల నుండే నిజాయితీ మొదలవ్వాలి. తక్షణ లాభం కంటే, భవిష్యత్తులో మీ మీద ఉండే గౌరవం, నమ్మకం గురించి ఆలోచించండి. నైతిక విలువలు కలిగిన వ్యక్తులతో సాంగత్యం చేయడం వల్ల మనలోని నిజాయితీ గుణం బలపడుతుంది. నేటి విద్యార్థులు రేపటి పౌరులు. పరీక్షల్లో కాపీ కొట్టి పాస్ అవ్వడం లేదా ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందడం వల్ల కెరీర్ మొదలవ్వొచ్చు కానీ, అది ఎదగదు. నైపుణ్యం లేని జ్ఞానం, నిజాయితీ లేని శ్రమ ఎప్పుడూ అసంపూర్ణమే. ఇంటర్వ్యూలో ఒక విషయం తెలియదని నిజాయితీగా ఒప్పుకుంటే, మీలోని నేర్చుకునే తపనను ఇంటర్వ్యూయర్ గుర్తిస్తాడు. అబద్ధం చెప్పి దొరికిపోతే మీ కెరీర్ అక్కడితో ముగిసిపోతుంది. నిజమైన జ్ఞానమే అసలైన విజయం. వ్యాపార రంగంలో ఇప్పుడు కార్పొరేట్ గవర్నెన్స్ అనేది ప్రాధాన్యత సంతరించుకుంది. ఇన్ఫోసిస్ వంటి సంస్థలు తమ పారదర్శకత వల్లే అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించగలిగాయి. అలాగే రాజకీయాల్లో కూడా మార్పు వస్తోంది. ప్రజలు ఇప్పుడు తెలివైనవారయ్యారు. అబద్ధపు వాగ్దానాల కంటే, నిజాయితీగా పని చేసే నాయకులకే పట్టం కడుతున్నారు. నెల్సన్ మండేలా వంటి నాయకులు తమ సిద్ధాంతాల కోసం దశాబ్దాల పాటు జైలు శిక్ష అనుభవించారు కానీ, ఎక్కడా లొంగలేదు. ఆ నిజాయితే వారిని ప్రపంచ నేతలుగా మార్చింది. విజయం అంటే కేవలం బ్యాంక్ బ్యాలెన్స్ మాత్రమే కాదు. ఒక తండ్రి తన పిల్లలకు నిజాయితీగా ఉండటం నేర్పిస్తే, ఆ పిల్లలు సమాజంలో ధైర్యంగా తలెత్తుకుని తిరుగుతారు. ఒక భార్యాభర్తల మధ్య ఉండే నిజాయితీ వారి బంధాన్ని బలపరుస్తుంది. ఇంట్లో పెద్దలు నిజాయితీగా ఉంటే, అది చూసి పెరిగే పిల్లలు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అలవరుచుకుంటారు. మా నాన్న ఎప్పుడూ అబద్ధం చెప్పడు అనే నమ్మకం పిల్లలకు ఇచ్చే ధైర్యం వేల కోట్లతో సమానం. చివరగా చెప్పాలంటే, నిజాయితీ అనేది బలహీనత కాదు, అది ఒక పర్వతం లాంటి బలం. ఇది మనకు ఇచ్చే అతిపెద్ద బహుమతి ప్రశాంతమైన నిద్ర. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేని, ఎవరికీ జవాబు చెప్పుకోవాల్సిన అవసరం లేని ఒక స్వచ్ఛమైన జీవితం నిజాయితీ వల్ల మాత్రమే సాధ్యం. నిజాయితీతో విజయం సాధ్యమా? అంటే అవును, వంద శాతం సాధ్యం. అయితే దానికి కొంత సమయం, పట్టుదల, మరియు ధైర్యం అవసరం. నిజాయితీ అనేది మనం పెట్టే పెట్టుబడి, అది వడ్డీతో సహా గౌరవం రూపంలో తిరిగి వస్తుంది. నిజాయితీగా జీవించే వ్యక్తి ఒక్కో అడుగూ నిశ్చింతగా వేయగలడు, ఎందుకంటే వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం అతనికి ఉండదు. సమాజంలో మార్పు మన నుండే మొదలవ్వాలి. మనం మారితే లోకం మారుతుంది. సత్యం వైపు నడవండి. విజయమే మీ వెనుక వస్తుంది.

> **ఒక అబద్ధాన్ని కాపాడుకోవడానికి వంద అబద్ధాలు ఆడాల్సి వస్తుంది. ఈ క్రమంలో కలిగే మానసిక ఒత్తిడి, ఆత్మవంచన మనిషిని లోపల నుండి ఖాళీ చేసేస్తాయి. అపారమైన సంపద ఉన్నా, ప్రశాంతత లేని జీవితం విజయమనిపించుకోదు. నిజాయితీగా ఉంటే నష్టపోతామని అనుకునేవారికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా గురించి ఎంత చెప్పినా తక్కువే. వ్యాపారంలో లాభాల కంటే విలువలకే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. 2008 ముంబై దాడుల సమయంలో టాటా గ్రూప్ తన ఉద్యోగులకే కాక, ప్రాంతంలో ఉన్న సామాన్యులకు కూడా అండగా నిలిచింది. ఒకానొక సమయంలో నైతిక కారణాల రీత్యా కొన్ని లాభదాయకమైన ఒప్పందాలను కూడా వారు వదులుకున్నారు. ఫలితంగా, నేడు టాటా అనే పేరు ఒక నమ్మకానికి చిహ్నంగా మారింది.**



కొత్త పార్టీ పేరు ప్రకటించిన శశికళ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, మార్చి 13: తమిళనాడు దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే మాజీ జనరల్ సెక్రటరీ వీకే శశికళ (Sasikala)..కొత్త పార్టీని స్థాపించారు. ఆ పార్టీకి ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం అని నామకరణం చేశారు. ఏఐపీటీఎంఎంకే పేరును ఇవాళ ఆమె వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు. ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అని ఆమె అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పనిచేస్తుందన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేయనున్నట్లు ఆమె చెప్పారు. మన నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న దశలోనే తాను కూడా ఉన్నానని, క్యాడర్ ప్రారంభించిన పార్టీలోనే ఆయన చేరారని ఆమె అన్నారు. తమ పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉన్నాయన్నారు. ఆ జెండాలో మాజీ సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయలలిత ఫోటోలు కూడా ఉన్నాయి.



దేశంలో ఎల్పీజీ కొరత లేదు

- అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేయొద్దు
- స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 13: దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ కొరత లేదని, భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు భయాందోళనతో వెంటవెంటనే ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ చేస్తున్నారని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ తెలిపారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ప్రతిరోజు దాదాపు 55.7 లక్షల ఎల్‌పీజీ బుకింగ్స్ జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య ఏకంగా 75.7 లక్షలు దాటిందన్నారు. ప్రజలు భయాందోళనతోనే భారీ బుకింగ్స్ చేస్తున్నారని ఈ గణాంకాలతో స్పష్టమవుతోందని ఆమె చెప్పారు. ఇంతగా ఆందోళన అక్కర్లేదని, దేశంలోని 25వేల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి దగ్గరా గ్యాస్ స్టాక్ పూర్తిగా అయిపోలేదని సుజాత శర్మ స్పష్టం చేశారు. శుక్రవారం దిల్లీలో కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో ఈవివరాలను ఆమె వెల్లడించారు. "దేశంలోని అన్ని పెట్రోలు బంక్‌లకు పెట్రోలు, డీజిల్‌ల సప్లై నిలకడగానే జరుగుతోంది. అన్ని బంక్‌లలోనూ పెట్రోలు, డీజిల్ లభిస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌ల తయారీలో భారత్ స్వయం సమృద్ధిని సాధించింది. ఏటా 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును శుద్ధిచేసే కెపాసిటీ భారతదేశ రిఫైనరీలకు ఉంది. ప్రస్తుతం దేశంలోని అన్ని రిఫైనరీలు 100 శాతం కెపాసిటీతో పనిచేస్తున్నాయి. మన దేశ రిఫైనరీల దగ్గర తగినన్ని ముడి చమురు నిల్వలు కూడా ఉన్నాయి. అందుకే పెట్రోల్, డీజిల్ సప్లైలో ఇబ్బంది ఏర్పడదు. మార్చి 5 నుంచి డొమెస్టిక్ ఎల్‌పీజీ ఉత్పత్తిని 30 శాతం పెంచాం. ప్రజల ఇళ్లకు వంటగ్యాస్ సప్లైలో అవాంతరం లేకుండా చూసేందుకే ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది" అని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ ఎల్‌పీజీ పరిస్థితి అనేది భారత ప్రభుత్వానికి ఆందోళనకర అంశంగానే ఉంది. దేశంలోని గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) సప్లై అంతరాయం లేకుండా జరుగుతోంది. ప్రస్తుతం భారత్‌లో 1.5 కోట్ల పీఎన్‌జీ డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రధాన నగరాల్లోని సింహభాగం వాణిజ్య వినియోగదారులకు ఎల్‌పీజీ కనెక్షన్లే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి కారణంగా వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఇబ్బందుల తొలగింపునకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఇలాంటి వాణిజ్య వినియోగదారులంతా ప్రత్యామ్నాయంగా పీఎన్‌జీ కనెక్షన్‌ను తీసుకోవచ్చు. ఇందుకోసం వారు ఆ నగరంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు లేదా డీలర్లను సంప్రదించాలి. తద్వారా ఎల్‌పీజీ సప్లైలపై కొంత ఒత్తిడి తగ్గుతుంది" అని సుజాత శర్మ సూచించారు.



ఈ విజయం మీ అందరిది

సూర్యకుమార్ భావోద్వేగ పోస్ట్

టీ20 సంచలనంగా భారత జట్టులో పాతుకుపోయిన సూర్యకుమార్ యాదవ్ సారథిగానూ హిట్టయ్యాడు. పొట్టి క్రికెట్ లో భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చిన సూర్య.. సొంతగడ్డపై భారత్‌కు పొట్టి ప్రపంచకప్ అందించిన తొలి కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో భారత ఆటగాళ్లు కొందరు తమ ప్రియురాళ్లతో సంబురాలు చేసుకోవడంపై దుమారం రేగుతున్న వేళ.. ఈ విజయంలో అభిమానులకూ భాగముందని చెబుతున్నాడు సూర్య. నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8న న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి కప్‌ను ఒడిసిపట్టింది. మరే ఆతిథ్య జట్టుకు సాధ్యమవ్వని విధంగా.. సొంతగడ్డపై పొట్టి వరల్డ్ కప్‌ను పట్టేసింది. సారథిగా దేశానికి వరల్డ్ కప్ అందించిన సూర్యకుమార్ యాదవ్ దిగ్గజాల సరసన చేరాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న మొదటి జట్టుగా టీమిండియా గుర్తింపు సాధించడంలో కీలకమైన ఈ మిస్టర్ 360 ప్లేయర్.. వరల్డ్ కప్ విజయం అందరిదీ అంటున్నాడు. 'ప్రియమైన భారత జట్టు అభిమానులరా.. మొదటగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఇక్కడ ఉన్నాం. ఈ వరల్డ్ కప్ ట్రోఫీ యావత్ దేశానికి చెందుతుంది. మేము గెలిచినా.. ఇది మా ఒక్కరి విజయమే కాదు. వరల్డ్ కప్ గెలవాలనేది మనదేశంలో బ్యాట్ పట్టుకున్న ప్రతి చిన్నారి కల. స్టేడియానికి భారీగా తరలివచ్చే అభిమానులకు ఈ ట్రోఫీ చెందుతుంది. ఇంటివద్ద నుంచి మాకు మద్దతు తెలిపిన లక్షలాదిమందికి ఈ ట్రోఫీ విజయంలో భాగముంది. మీ ప్రార్థనలు, అంతులేని ప్రేమ మాకు వరల్డ్ కప్ ట్రోఫీని గెలిచేందుకు అవసరమైన బలాన్నిచ్చాయి. భారత్‌లో క్రికెట్ కేవలం ఆటే కాదు. అది ఒక భావోద్వేగం. అందుకే.. ఈ విజయం మీ అందరిది' అని సూర్యకుమార్ భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టాడు.



ట్రెండింగ్ లో 'బాయ్ కాట్ సన్ రైజర్స్'

కావ్యా మారన్ పై నెటిజన్ల ఆగ్రహం

ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ పై నెటిజన్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. విదేశీ లీగే అయినప్పటికీ శత్రుదేశం ఆటగాడిని కొన్నందుకు ఆమెపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఫలితంగా బాయ్‌కాట్ సన్‌రైజర్స్ హ్యాష్‌ట్యాగ్ నెట్టింట ట్రెండ్ అవుతోంది. ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్ ను సన్‌రైజర్స్ లీడ్స్ కొనడమే దీనికంతటికి కారణం. భారత ఫ్రాంచైజీలు పాకిస్థాన్ ఆటగాళ్లను కొనడం మానేసి చాలా రోజులైంది. ఐపీఎల్ ఆరంభంలో వసీం అక్రమ్, సొహైల్ తన్వీర్.. వంటి కొందరికి అవకాశాలిచ్చినా ఆ తర్వాత మాత్రం పాక్ ఆటగాళ్లకు నో ఎంట్రీ బోర్డు పెట్టింది బీసీసీఐ. అలాంటిది ఇప్పుడు సన్‌రైజర్స్ జట్టులో దాయాది మిస్టరీ స్పిన్నర్‌కు చోటు దక్కింది. గురువారం జరిగిన ది హండ్రెడ్ వేలంలో అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ భారీ ధరకు కొన్నది. వేలంలో అబ్రార్‌ను లక్షా తొంభై వేల యూరోలకు 190,000 భారతీయ కరెన్సీలో రూ.2.34 కోట్లకు దక్కించుకుంది. భారత్‌పై అక్కసు వెళ్లగక్కే అబ్రార్‌ను సన్‌రైజర్స్ జెర్సీలో చూడాల్సి రావడం కొందరికి నచ్చడం లేదు. అందుకే.. సోషల్ మీడియా వేదికా కావ్య మారన్‌ను, ఆరెంజ్ ఆర్మీ టీమ్‌ను ట్రోల్స్ చేస్తున్నారు. ఇదే అంశంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాను సంప్రదించగా 'మాకేం తెలియదు' అని బదులిచ్చాడు. 'ది హండ్రెడ్ లీగ్ అనేది భారత బోర్డు నిర్వహించే లీగ్ కాదు. విదేశీ ఆటగాళ్లకు సంబంధించిన లీగ్ అది. సో.. ఫ్రాంచైజీలు ఏ ఆటగాడినైనా కొనుక్కునేందుకు అవకాశముంది. ఈ విషయంలో మేము ఏం చేయలేం. చెప్పాలంటే మా చేతుల్లో ఏమీ లేదు' అని శుక్లా సమాధానమిచ్చాడు.



తీవ్రంగా గాయపడ్డ పాక్ క్రికెటర్

బంగ్లాదేశ్ పర్యటనను ఓటమితో ఆరంభించిన పాకిస్థాన్‌కు మరో షాక్. ఆ జట్టు యువ ఆల్‌రౌండర్ హుస్సేన్ తలాట్ అనూహ్యంగా గాయపడ్డాడు. రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో.. నొప్పితో విలవిలలాడిన అతడిని సిబ్బంది స్ట్రెచర్ మీద బయటకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం తలాట్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. 'భుజం గాయంతో ఇబ్బందిపడిన హుస్సేన్ తలాట్‌కు మైదానంలోని వైద్యసిబ్బంది పరీక్షించారు. అనంతరం అతడిని తదుపరి వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించాం. స్కానింగ్ పరీక్షల అనంతరం తలాట్‌కు అయిన గాయం తీవ్రత గురించి తెలుస్తుంది' అని పీసీబీ ఒక ప్రకటనలో పేర్కొంది.



హ్యాపీ బర్త్‌డే సిరాజ్







మల్టీప్లెక్సుల కంటే ఎక్కువ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని

'అల్లు సినిమాస్'ను నిర్మించాం

నిర్మాత అల్లు అరవింద్


ప్రపంచ స్థాయి సాంకేతికతతో కూడిన ప్రీమియం లార్జ్ స్క్రీన్ ఫార్మాట్‌ను 'అల్లు సినిమాస్' హైదరాబాద్‌కు పరిచయం చేస్తోంది. హైదరాబాద్‌కు ఇదొక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. నగరంలో తొలి డాల్బీ సినిమా వచ్చింది. హైదరాబాద్‌లోని కోకాపేటలోని 7 ఎకరాల అల్లు స్టూడియోస్ కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు స్క్రీన్‌ల అల్ట్రాలగ్జరీ మల్టీప్లెక్స్ అల్లు సినిమాస్‌ను ప్రారంభించినట్లు అల్లు ఎంటర్‌టైన్‌మెంట్ గర్వంగా ప్రకటించింది. ఇకపై ల్యాండ్‌మార్క్ వినోద గమ్యస్థానంగా అల్లు సినిమాస్ మారనుంది. హైదరాబాద్‌ను అల్లు సినిమాస్ వరల్డ్ సినిమా మ్యాప్‌లో సరికొత్త స్థాయిలోని నిలబెడుతుంది. హైదరాబాద్‌లో మొట్టమొదటి డాల్బీ సినిమా, ప్రపంచంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌లలో ఒకటిగా 'అల్లు సినిమాస్' రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ మైలురాయి ప్రపంచవ్యాప్తంగా ఎంటర్టైన్మెంట్ రంగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుంది. ప్రేక్షకులకు ఈ 'అల్లు సినిమాస్' అత్యాధునిక సాంకేతికత, లగ్జరీ, సౌకర్యవంతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. 'అల్లు సినిమాస్' ఇచ్చే ఎక్స్‌పీరియెన్స్ గురించి అల్లు అరవింద్ మీడియాతో ముచ్చటించారు. అల్లు సినిమాస్ ప్రారంభోత్సవ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ.. 'రెండేళ్లు కష్టపడి 'అల్లు సినిమాస్'ను నిర్మించాం. 'అల్లు సినిమాస్'ను నిర్మించడానికి మూడు కారణాలున్నాయి. యూవీ వంశీ సూళ్లూరుపేటలో లగ్జరీ థియేటర్‌ను కట్టారు. ఆ థియేటర్లో సినిమాని చూడటానికి పక్క ఊర్ల నుంచి కూడా జనాలు వస్తున్నారు. అది చూసి నాకు కూడా ఓ లగ్జరీ థియేటర్ కట్టాలని అనిపించింది. మిషన్ ఇంపాజిబుల్ 6 కోసం ఓ పెద్ద పారిశ్రామికవేత్త ఐమ్యాక్స్ లార్జ్ స్క్రీన్‌లో టికెట్లు కావాలని, పిల్లలు గోల చేస్తున్నారని, కచ్చితంగా టికెట్లు కావాలని అడిగారు. ఆ టికెట్లు నేను ఆయనకు ఇవ్వడంతో చాలా సంతోషించారు. అంటే పిల్లలు కేవలం సినిమాని చూడకుండా, దాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలని అనుకుంటున్నారు. ఆ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. అప్పుడు నాకు కొన్ని ఐడియాలు వచ్చాయి. లార్జ్ ఫార్మాట్, కొత్త ఎక్స్‌పీరియెన్స్ కోసం ఆడియెన్స్ ఎదురుచూస్తున్నారు. అలా మా 'అల్లు సినిమాస్' మొదలైంది. సింగిల్ స్క్రీన్లలో వస్తున్న ఎక్స్‌పీరియెన్స్ ఇప్పుడు జనాలకు సరిపోవడం లేదు. అందుకే ఎక్కువగా మల్టీ ప్లెక్స్‌లకు వస్తున్నారు. సినిమా కంటే.. సినిమాని ఎక్స్‌పీరియెన్స్ చేసేందుకు జనాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మల్టీప్లెక్సుల కంటే ఎక్కువ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వాలని 'అల్లు సినిమాస్'ను నిర్మించాం. డాల్బీలో సినిమా చాలా కొత్తగా కనిపిస్తుంది, వినిపిస్తుంది. డాల్బీలోకి మారిన సినిమా విజువల్ పరంగా, సౌండ్ పరంగా అద్భుతంగా ఉంటుంది. 2024లో మేం డాల్బీని సంప్రదించాం. డాల్బీ సినిమాస్ ఇండియా ప్రతినిధి రాజ్ మాకు ఎంతో సహకరించారు. అమెరికా, జర్మనీ, ఇండియన్ టీం ఇలా అందరం కలిసి ఓ డెబ్బై సార్లు జూమ్ కాల్స్‌లో కలిసి ఉంటాం. ఈ స్క్రీన్‌లో 78 స్పీకర్లు, 165 సౌండ్ ఔట్ లెట్లను బయటకు కనిపించకుండా అమర్చారు. జర్మనీ టీం ఈ స్క్రీన్‌ను చూసి ఆశ్చర్యపోయారు. 'అల్లు సినిమాస్' ఇచ్చే ఎక్స్‌పీరియెన్స్ గురించి మీడియానే జనాల్లోకి తీసుకెళ్లాల'ని అన్నారు.

మరెక్కడా లేని డాల్బీ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్..

648 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన ఈ ఫ్లాగ్‌షిప్ డాల్బీ సినిమా ఆడిటోరియం ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్ సైజులలో ఒకటి. 75 అడుగుల వెడల్పు ఫ్లాట్ యాస్పెక్ట్ రేషియోలో, భారతదేశంలో అతి పెద్ద డాల్బీ సినిమాగా నిలిచింది. హైదరాబాద్‌లో ఇలాంటిది ఇంతకు ముందు లేదన్న సంగతి తెలిసిందే. ఆడిటోరియం డాల్బీ సినిమా డిజైన్ ప్రమాణాల ప్రకారం అమలు చేయబడిన డ్యూయల్ డాల్బీ విజన్ 6P లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్‌ను కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యంత ప్రీమియం డాల్బీ 3D ద్వారా శక్తిని పొందుతుంది. పిచ్ బ్లాక్ ఆడిటోరియంలు పర్‌ఫెక్ట్ కాంట్రాస్ట్ కోసం రూపొందించబడ్డాయి. ఎక్స్‌ట్రీమ్ బ్రైట్ నెస్, డీపర్ బ్లాక్స్, రిచ్ లీ వైబ్రెంట్ కలర్స్‌తో ఉత్కంఠభరితమైన విజువల్స్‌ను అందిస్తాయి. 64ఛానల్ డాల్బీ అట్మాస్ ఇమ్మర్సివ్ ఆడియో సిస్టమ్ ఓవర్ హెడ్‌తో సహా అన్ని దిశల నుండి ధ్వనిని ప్రసారం చేయడం ద్వారా ఓ కొత్త లోకానికి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తుంది. పూర్తిగా లీనమయ్యేలా సరికొత్త సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుంది. కర్వ్డ్ (వంపుతిరిగిన) స్టేడియం సీటింగ్ పర్ ఫెక్ట్ వ్యూయింగ్ యాంగిల్‌ను అందిస్తుంది. తద్వారా ప్రేక్షకుడు ఎక్కడ ఏ సీటులో కూర్చున్నా కూడా అత్యుత్తమమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను పొందుతాడు. ఇది కేవలం స్క్రీన్‌గా మాత్రమే కాకుండా ప్రెసిషన్ ఇంజనీరింగ్‌గా నిలుస్తుంది.

ట్రెడిషనల్ బ్యూటీ

శ్రీలీల ఫోటోషూట్ కోసం ఎంచుకున్న అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. రిచ్ కలర్ పట్టుచీరలో ఆమె లుక్ చాలా రాయల్‌గా కనిపిస్తోంది. సాధారణంగా నేటి తరం హీరోయిన్లు మోడ్రన్ ఫ్యాషన్‌పై మక్కువ చూపుతుంటారు. కానీ శ్రీలీల మాత్రం మన సంప్రదాయ కట్టుబాట్లకు పెద్దపీట వేసింది. ఆ చీరకు మ్యాచ్ అయ్యేలా డిజైన్ చేసిన బ్లౌజ్ మరియు ఆమె కట్టుకున్న తీరు చాలా హుందాగా ఉంది. ఫొటోల్లో ఆమె చిరునవ్వు, ఆ నిండుదనానికి ఫిదా అవుతున్న నెటిజన్లు "శ్రీలీల అంటే కేవలం ఎనర్జీ మాత్రమే కాదు, అందానికి నిలువుటద్దం" అంటూ కామెంట్లు పెడుతున్నారు. శ్రీలీల ధరించిన నగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం నగలు పెట్టుకోవడమే కాకుండా, మన పూర్వీకుల కాలం నాటి సంప్రదాయ డిజైన్లను ఆమె ఎంచుకోవడం విశేషం. షార్ట్ నెక్లెస్‌తో పాటు, దానికి తగినట్లుగా ఉన్న జుంకీలు ఆమె ముఖ వర్చస్సును పెంచేశాయి. ఇక ముఖ్యంగా నుదుట పెట్టుకున్న పెద్ద బొట్టు, తలలో పూలు ఆమెను ఒక దేవతలా మార్చేశాయి





పదే పదే ప్రాణం నిన్నే కోరగా

**'పదే పదే ప్రాణం నిన్నే కోరగా
కలే నిజం కాదా నిన్ను చేరగా
ఒకే ఒక ఆశ చాలుగా నువ్వే చాలుగా
ప్రపంచమే లేదే ప్రతీ క్షణం నువ్వే నా కథ'**

అంటూ అమ్మాయి తన మనసులోని ప్రేమను అబ్బాయికి చెప్పటానికి ఎంతో ఆశతో, ఆతృతగా ఎదురుచూస్తోంది. ఇంతకీ అమ్మాయి మనసులో ప్రేమను సంపాదించుకున్న అబ్బాయి కథేంటో తెలుసుకోవాలంటే రాకాస సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.. ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకుంది. అలాంటి ఓ అద్భుతమైన సినిమా తరువాత జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు 'రాకాస' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్, గ్లింప్స్, టీజర్, సాంగ్ అన్నీ కూడా జనాల్లో క్యూరియాసిటీని పెంచేశాయి. ప్రస్తుతం మ్యూజికల్ ప్రమోషన్స్‌లో టీం బిజీగా ఉంది. ఈ క్రమంలోనే 'పదే పదే' అంటూ సాగే ఓ మెలోడీ సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేసింది. ఈ లిరికల్ వీడియో సాంగ్‌ని చూస్తుంటే హీరో మీద హీరోయిన్‌కి ఉన్న ప్రేమ, వన్ సైడ్ లవ్ స్టోరీ కనిపిస్తోంది. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీ, వారి ప్రేమను చాటేలా సాంగ్ సాగింది. ఇక గ్రామీణ వాతావరణంలో చిత్రీకరించిన ఈ పాటలోని విజువల్స్ మనసుని హత్తుకునేలా ఉన్నాయి. అనుదీప్ దేవ్ అందించిన బాణీ, కిట్టు విస్సాప్రగడ సాహిత్యం, సింధూజ శ్రీనివాసన్ గాత్రం ఈ పాటను మరింత ప్రత్యేకంగా, గుండెల్ని హత్తుకునేలా మార్చేశాయి. ఈ చిత్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫర్‌గా, ఎడిటర్‌గా అన్వర్ అలీ పని చేశారు. ఈ మూవీ ఆడియో హక్కుల్ని సరిగమ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమాని ఓవర్సీస్‌లో అథర్వణ భద్రకాళి పిక్చర్స్, కెనడాలో ప్రత్యంగిరా సినిమాస్ ఏప్రిల్ 3న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.



27న వస్తున్న 'హ్యాపీ రాజ్'

భారతదేశంలోని అతిపెద్ద నిర్మాణ సంస్థలలో ఒకటైన మైత్రి మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూషన్ లో కూడా అద్భుతంగా కొనసాగుతోంది, టాలీవుడ్ నుండి మాత్రమే కాకుండా ఇతర భాషల నుండి కూడా తెలుగు ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాలను అందిస్తోంది. వారి డిస్ట్రిబ్యూషన్ బ్రాంచ్, మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో 'హ్యాపీ రాజ్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రంలో కంపోజర్‌హీరో జివి ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించారు. స్టార్ హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ధ నిర్మించారు. మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిచింది. ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో పాజిటివ్ బజ్‌ను సృష్టిస్తోంది. జివి ప్రకాష్ కుమార్ కాన్ఫిడెంట్‌గా నల్లటి సూట్, ఓపెన్‌కాలర్ షర్ట్, సన్‌గ్లాసెస్ ధరించి, స్ట్రీట్ స్మార్ట్ గా ఆటో రిక్షా నుండి బయటకు వస్తున్న ఫస్ట్ లుక్ స్టైలిష్‌గా అందరిదృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంలో అబ్బాస్, జార్జ్ , గీతా కైలాసం, ప్రార్థన నాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హ్యాపీ రాజ్ రిఫ్రెషింగ్ నేపథ్యంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200